విశాఖపట్టణం
శనివారం 22 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయజయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 210 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## రాయదుర్గం భూములకు రికార్డు ధర

వేలంలో ఎకరాకు 264 కోట్లకు అమ్మకం 2



## స్థానిక ఎన్నికల కోసం జనసేన కమిటీ

మంత్రులు, ఎంపీలతో జనసేన కమిటీ.. స్థానిక ఎన్నికలే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన ప్రత్యేక దృష్టి

14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ఎన్నికల వ్యూహాలు, మార్గదర్శకాల రూపకల్పన బాధ్యత

కమిటీలో మంత్రి దుర్గేష్, ఎంపీ బాలశౌరికి చోటు







**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

స్థానిక ఎన్నికలపై జనసేన పార్టీ ఫోకస్ పెంచింది. స్థానిక ఎన్నికల్లో జనసైనికుల ఆత్మగౌరవం నిలబెడతామని గురువారం నాటి సమావేశంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అలాగే స్థానిక ఎన్నికలలో అనుసరించాల్సిన విధి విధానాల తయారీకి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు కూడా. తాజాగా జనసేన పార్టీ 14 మందితో స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల రూపకల్పన కమిటీని ప్రకటించింది. ఇందులో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేరు లేకపోవటం ప్రాధాన్యం సంతరించుకుంది.

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయమై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురువారం ముఖ్య నేతలతో చర్చించారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధి విధానాల రూపకల్పనకు 14 మందితో ప్రత్యేక కమిటీని పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధినాలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటుంది. కమిటీలో మండలి బుద్ధ ప్రసాద్, టి.శివశంకర్, కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పత్సమట్ల ధర్మరాజు, చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవికుమార్ సభ్యులుగా ..మిగతా 2లో



### అవినాశ్ రెడ్డి ఇంట్లో

## ఈడీ సోదాలు

రూ. 24 లక్షల నగదు స్వాధీనం

వివేకా హత్య కేసులో ఈడీ దూకుడు

ఎంపీ అవినాశ్ రెడ్డి నివాసం సహా 7 చోట్ల సోదాలు

హత్య కోసం రూ. 40 కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలపై దర్యాప్తు

సీబీఐ చార్జిషీట్ ఆధారంగా మనీ లాండరింగ్ కేసు నమోదు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో విచారణ జరుపుతున్న ఈడీ, శుక్రవారం హైదరాబాద్, కడప నగరాల్లోని ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. తనిఖీలు ముగిసిన అనంతరం ఆ వివరాలను ఈడీ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఈ సోదాల్లో నేరానికి సంబంధించినవని భావిస్తున్న పలు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ పేర్కొంది. కడప ఎంపీ ..మిగతా 2లో

## ఆలయాల్లో శ్రావణ సందడి

వరలక్ష్మీదేవిగా అభయమిచ్చిన కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వెలసిన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వరలక్ష్మీ దేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారికి దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు. జై దుర్గా జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. వరలక్ష్మీ వ్రతం ..మిగతా 2లో



### నేడు కేరళకు

## పవన్ కళ్యాణ్

ఆయుర్వేద థెరపీ చేయించుకోన్న డిప్యూటీ సిఎం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**



జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. శనివారం కేరళకు వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన.. వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు పవన్ కల్యాణ్‌కు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలకు, అధికారిక విధులకు దూరంగా ..మిగతా 2లో



### సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం

## అనుమతి నిరాకరణ

ఈ నెల 23న లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం

వచ్చే నెలలో అమెరికా వెళ్లే యోచన

అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం

'తెలంగాణ రైజింగ్' ఆగదని సీఎం స్పష్టీకరణ

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహించాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ..మిగతా 2లో

## సాదిక్ ఖాన్ దొరికాడు!

ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు..


ఏఈ కుటుంబాన్ని ఆత్మహత్యకు ప్రేరేపించిన షూటింగ్ కోచ్

భర్తను విషమిచ్చి చంపాడని భార్య సూసైడ్ నోట్

ప్రైవేట్ ఫొటోలతో బ్లాక్‌మెయిల్, ఆస్తుల కోసం వేధింపులు

పరారీలో ఉన్న నిందితుడు షేక్ సాదిక్ ఖాన్

ఐదు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు





**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాదిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. కొన్ని రోజులుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న అతడిని ఎట్టకేలకు పట్టుకున్నారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ..మిగతా 2లో

### ప్రముఖ నటి

## షావుకారు జానకి కన్నుమూత

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**



ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. ఆమె గత కొంత కాలంగా శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ..మిగతా 2లో

# సాదిక్ ఖాన్ దొరికాడు!

మొదటి పేజీ తరువాయి...

సాదిక్ ఖాన్‌ను కాకినాడకు తరలిస్తున్నట్టు సమాచారం.

**అసలేం జరిగిందంటే..**

పంచాయతీ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న టిల్లాపూడి నూకరాజు, ఆయన భార్య, కుమార్తెతో కలిసి ఈ నెల 16న రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు వారు రాసిన సూసైడ్ నోట్‌లో తమ చావుకు కోచ్ సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని స్పష్టంగా పేర్కొన్నారు. తన కుమార్తె సౌజన్యను లోబరుచుకునేందుకు ప్రయత్నించాడని, ముస్లిం మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని, తమ కుటుంబంపై తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశాడని నూకరాజు ఆ లేఖలో ఆరోపించారు.

ఈ ఘటన తర్వాత పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆయన భార్య మీనా మృతదేహం కోసం గాలింపు ఇంకా కొనసాగుతోంది. మనవడు ఎలాగోలా ఈదుకుంటూ బయటపడ్డాడు.

**ఐదు బృందాలతో గాలింపు..**

నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి సాదిక్ ఖాన్ పరారీలో ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు కాకినాడ జిల్లా పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, ముంబై నగరాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. పోలీసులను తప్పించుకునేందుకు సాదిక్ ఖాన్ తన సెల్ ఫోన్‌ను ఉపయోగించకుండా, వేర్వేరు



ప్రాంతాలకు మారుతూ జాగ్రత్తలు తీసుకున్నాడు. అయినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో అతడి కదలికలను గుర్తించిన పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు.

**వివరాల్లోకి వెళితే..**

ఏఈ నూకరాజు మనవడు, కాకినాడలో సాదిక్ ఖాన్ నడుపుతున్న షూటింగ్ అకాడమీలో చేరాడు. దీన్ని అదనుగా చేసుకున్న సాదిక్, నూకరాజు కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. ముఖ్యంగా, నూకరాజు కుమార్తె సౌజన్యకు మాటలతో వల వేసి, ఆమెను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. క్రమంగా ఆ ఇంటిపై పట్టు సాధించి, ఇంట్లో ఉన్న బంగారం, నగదు, ఏటీఎం కార్డులను కూడా తన నియంత్రణలోకి తీసుకున్నాడు.

సాదిక్ ఖాన్ పెట్టిన తీవ్ర మానసిక హింసను తట్టుకోలేక నూకరాజు కుటుంబం గోదావరి నదిలో దూకింది. అయితే, సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి జూలై 2న మరణించడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది.

జగదీశ్వర్ రెడ్డి మృతిపై అతని తండ్రి భాస్కర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సౌజన్య రాసిన లేఖలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన భర్త జగదీశ్వర్ రెడ్డికి సాదిక్ ఖాన్ విషపూరిత పదార్థం ఇచ్చి చంపాడని ఆమె ఆరోపించింది. తన ప్రైవేట్ ఫొటోలను అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని, ఆస్తుల కోసం తనతో పాటు తన తండ్రి నూకరాజును కూడా చంపేస్తానని బెదిరించాడని లేఖలో పేర్కొంది. అంతేకాకుండా, ఇస్లాం మతంలోకి మారాలని తనపై ఒత్తిడి తెచ్చాడని కూడా ఆమె ఆరోపించింది.

భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు సాదిక్ ఖాన్‌పై హత్యాప్రయత్నంతో పాటు మరో ఐదు నేరాల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయం తెలియగానే సాదిక్ తన మొబైల్ ఫోన్‌ను వదిలేసి పరారయ్యాడు. ఇతరుల ఫోన్ల నుంచి కాల్స్ చేస్తూ రైలులో పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన మూడు, తూర్పుగోదావరికి చెందిన రెండు పోలీసు బృందాలు అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుడు జగదీశ్వర్ రెడ్డి ఫోన్ కూడా సాదిక్ వద్దే ఉన్నట్లు సమాచారం.

అకాడమీకి వచ్చే యువతులు, బాలికలనే లక్ష్యంగా చేసుకుని "ప్రత్యేక శిక్షణ" పేరుతో సాదిక్ వారిని ఒంటరిగా కలుస్తాడని, శిక్షణ సమయంలో అనుచితంగా ప్రవర్తిస్తాడని కూడా ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



### పోలీస్ స్టేషన్ ముందు

# రాహుల్ గాంధీ ధర్నా

**పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్**

**బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ**

**ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా**

**జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ**

**పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన**

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

### అవినాశ్ రెడ్డి ఇంట్లో

# ఈడీ సోదాలు

మొదటి పేజీ తరువాయి...

వైఎస్ అవినాష్‌రెడ్డికి చెందిన ప్రాంగణాల్లో లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదుతో పాటు రెండు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది.

సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌తో పాటు అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి వాంగ్మూలాన్ని ఉటంకిస్తూ ఈడీ పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ఈ హత్యకు రూ.40 కోట్లు చెల్లించేలా కుట్ర జరిగిందని దస్తగిరి వెల్లడించినట్లు తెలిపింది. ఇందులో తన వాటాగా రూ.5 కోట్లు ఇస్తామని టి. గంగిరెడ్డి హామీ ఇచ్చినట్లు ఈడీ పేర్కొంది. దస్తగిరికి వై. సునీల్ యాదవ్ నుంచి రూ. కోటి అందగా, అందులో రూ.25 లక్షలను సునీల్ యాదవ్ తన వద్దే ఉంచుకుని, మిగిలిన రూ.75 లక్షలను తన స్నేహితుడు సయ్యద్ మున్నాకు ఇచ్చినట్లు దస్తగిరి వెల్లడించాడని ఈడీ వివరించింది. సయ్యద్ మున్నా, అతని తల్లి లాకర్ల నుంచి సీబీఐ గతంలో రూ.46.70 లక్షల నగదుతో పాటు లెక్కల్లో చూపని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న విషయాన్ని కూడా ఈడీ ప్రస్తావించింది.

2019 మార్చి 15న పులివెందులలో వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయ్యారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన సీబీఐ ఇప్పటికే పలు చార్జిషీట్లను దాఖలు చేసింది. వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, డి. శివశంకర్‌రెడ్డి, టి. గంగిరెడ్డి, వై. సునీల్ యాదవ్ తదితరులను నిందితులుగా సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్నట్లు ఈడీ వెల్లడించింది.



### సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం

# అనుమతి నిరాకరణ

మొదటి పేజీ తరువాయి...

లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహిం చేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. అయితే చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ నుంచి అనూహ్య పరిణామం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించా ల్సిన సమావేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కేంద్రం నిర్ణయం వెనక కారణం ఏంటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలయరాలేదు. ప్రస్తుతం రద్దయిన అమెరికా పర్యటనను వచ్చే నెలలో చేపట్టాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈసారి అమెరికాలో జరగాల్సిన భేటీలకు సీఎం స్వయంగా వెళ్లకుండా అధికారుల బృందాన్ని పంపే యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' ప్రయాణం ఆగదని ధీమా వ్యక్తం చేశారు.

### రాయదుర్గం భూములకు

# రికార్డు ధర

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**


నగరంలోని రాయదుర్గంలో ఎకరం భూమి రికార్డు ధర పలికింది. పాన్‌మక్తాలో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎకరా రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది. మొత్తం 5.25 ఎకరాలనూ ఆ సంస్థే దక్కించుకుంది. ఇదే సర్వే నంబర్‌లో మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. వేలంలో కనీస ధర రూ.175 కోట్లు, డిపాజిట్ రూ.10కోట్లుగా టీజీఐఐసీ నిర్ణయించింది. బిడ్డర్లు డిపాజిట్ చెల్లించి ఆన్‌లైన్ వేలంలో పాల్గొన్నారు. ఖరీదైన భూమి కావడంతో స్థిరాస్తి సంస్థలు పోటీపడి బిడ్డింగ్ దాఖలు చేశాయి. చివరికి ఎంఎస్ఎన్ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని దక్కించుకుంది.

### నేడు కేరళకు

# పవన్ కళ్యాణ్

మొదటి పేజీ తరువాయి...

ఉండాలని కూడా వైద్యులు సూచించినట్లు జనసేన కేంద్ర కార్యాలయం తెలిపింది. అయితే పాలనా బాధ్యతల నేపథ్యంలో ఆయన వారం రోజుల్లోనే క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ఆ తర్వాత ముందుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో శస్త్రచికిత్స చేసిన కుడి భుజం ప్రాంతంలో వాపు పెరగడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేలా చికిత్స తీసుకోవాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే కేరళలోని ఆయుర్వేద వైద్యాలయంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స, విశ్రాంతికి ప్రాధాన్యత ఇస్తూనే తన పాలనా బాధ్యతలను కొనసాగించేందుకు పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నట్లు జనసేన కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



### ప్రముఖ నటి షావుకారు జానకి

# కన్నుమూత

మొదటి పేజీ తరువాయి...

ఆమె కన్నుమూశారు. షావుకారు జానకి.. నటి కృష్ణకుమారికి సోదరి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ కెరీర్ ప్రారంభించారు. 11 ఏళ్లకు రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. 1949లో 'రక్షా రేఖ' సినిమాతో చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 1950లో 'షావుకారు' సినిమా హిట్ కావడంతో ఆమెకు షావుకారు జానకిగా పేరు వచ్చింది. ఆ తర్వాత అనేక సూపర్ హిట్ చిత్రాల్లో జానకి నటించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో, 3 హిందీ సినిమాల్లోనూ, ఒక మలయాళ చిత్రంలో నటించి మెప్పించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

**ఇల్లు గడవక నటిగా మారి.. షావుకారు జానకి జీవితమిది..**


'వద్దంటే డబ్బు', 'కన్యా శుల్కం', 'పిచ్చి పుల్లయ్య' , 'రేచుక్క-పగటిచుక్క, 'రోజులు మారాయి', 'సొంతవూరు', 'జయం మనదే', 'డాక్టర్ చక్రవర్తి', 'సంసారం ఒక చదరంగం', 'తోడికోడళ్ళు', 'బాబు బంగారం', 'గీతాంజలి' ఇలా అనేక హిట్ చిత్రాలలో జానకి నటించారు. చివరి సారి 'అన్నీ మంచి శకునములే'లో ఆమె కనిపించారు.

### స్థానిక ఎన్నికల కోసం

# జనసేన కమిటీ

మొదటి పేజీ తరువాయి...

ఉంటారని జనసేన పార్టీ అధికారికంగా ప్రకటించింది. అయితే 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేరు లేకపోవటంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపుబాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన జాయినింగ్స్ కమిటీ, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు, డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల రూపకల్పన కమిటీలో చోటు లేకపోవటంతో నెట్టింట చర్చ జరుగుతోంది.



### ఆలయాల్లో

# శ్రావణ సందడి

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా దుర్గమ్మ ఆలయంతోపాటు రాష్ట్రంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే కొన్ని ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. శాకంబరీ దేవి అలంకరణలో కుంకుళ్లమ్మ అమ్మవారు.. భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించారు. భక్తులు.. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. భీమవరం మావుళ్లమ్మకు నాలుగు లక్షల గాజులతో అలంకరించారు.శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఇందుకోసం భక్తులు నాలుగు లక్షల గాజులను సమర్పించారు. నెల్లూరు జిల్లాలో శ్రావణ శుక్రవార పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేషార్చనలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని గాజులు, వజ్రకిరీటంతో ప్రత్యేకంగా అలంకరించారు. అటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.విశాఖపట్నం: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపారు. శ్రీకనకమహాలక్ష్మి, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# 629 ఏఈఈ పోస్టులకు 1.05 లక్షల మంది అభ్యర్థులు

### రేపటి నుంచి 27 వరకు ఐదు రోజుల పాటు కంప్యూటర్ ఆధారిత పరీక్ష

### ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లో 94 పరీక్షా కేంద్రాలు

### ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

**విశాఖపట్నం, ఆగస్టు 21, జయ జయహే**

రాష్ట్ర విద్యుత్ రంగంలో సాంకేతిక సిబ్బందిని మరింత బలోపేతం చేయడంతో పాటు అర్హత కలిగిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఏపీ విద్యుత్ సంస్థల్లో ఏఈఈల నియామకం కోసం నిర్వహిస్తున్న నియామక పరీక్ష-2026కు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు విస్తృత ఏర్పాట్లు చేశాయని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ సంస్థల్లో 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఈ పరీక్షకు 1,05,566 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారన్నారు. ఆగస్టు 23 నుంచి 27 వరకు ఐదు రోజుల పాటు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నామని, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లో కలిపి మొత్తం 94 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి, పరీక్షను పారదర్శకంగా, పకడ్బందీగా, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహించేందుకు బహుళస్థాయి భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి అర్హత కలిగిన అభ్యర్థికి సమానమైన, న్యాయమైన అవకాశాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పరీక్ష



విశ్వసనీయతను కాపాడేందుకు సాంకేతికత, బయోమెట్రిక్ ధృవీకరణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, కేంద్రస్థాయి మానిటరింగ్‌తో పాటు పటిష్టమైన పరిపాలనా, భద్రతా చర్యలను చేపట్టామని, పరీక్ష ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, విశ్వసనీయంగా, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

**94 పరీక్షా కేంద్రాల్లో బహుళస్థాయి భద్రత**

పరీక్ష కోసం మొత్తం 94 కేంద్రాలను ఏర్పాటు చేశారని, వీటిలో 81 కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మరో 13 కేంద్రాలు రాష్ట్రం వెలుపల ఉన్నాయని తెలిపారు. పరీక్ష ప్రక్రియలో సాంకేతికత, బయోమెట్రిక్ ధృవీకరణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, కేంద్రస్థాయి మానిటరింగ్, భౌతిక తనిఖీలతో కూడిన బహుళస్థాయి భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నపత్రం లేదా సమాధానాల సమాచారాన్ని అక్రమంగా ప్రసారం చేయకుండా మొబైల్ జామర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష హాళ్లు, ప్రవేశ ద్వారాలు, కారిడార్లు, సర్వర్ రూమ్‌లను సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని, విజయవాడలోని విద్యుత్ సౌధలో ఏర్పాటు చేసిన కేంద్ర కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని పరీక్షా కేంద్రాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించే ఏర్పాట్లు చేశామని తెలిపారు.

**పరీక్ష అనంతరం కూడా పారదర్శక ప్రక్రియ**

పరీక్ష అనంతరం కూడా స్పష్టమైన గైడ్‌లైన్ ప్రకారం నియామక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. చివరి పరీక్ష జరిగిన తేదీ నుంచి మూడు రోజుల్లో ప్రిలిమినరీ ఆన్సర్ కీ విడుదల చేసి, అనంతరం ఏడు రోజుల పాటు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత నోటిఫై చేసిన ఖాళీలకు 1:1 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారని, తుది ఎంపిక, కేటాయింపు పూర్తిగా మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు, అభ్యర్థుల ప్రాధాన్యత ఆధారంగా జరుగుతుందని పేర్కొన్నారు. మొత్తం ఎంపిక ప్రక్రియలో మెరిట్, పారదర్శకత, న్యాయబద్ధతకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నియామక పరీక్షకు సంబంధించిన సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక ప్రకటనలు, అధికారిక రిక్రూట్‌మెంట్ పోర్టల్‌ను మాత్రమే ఆధారంగా చేసుకోవాలని, పుకార్లు, తప్పుడు సమాచారం లేదా అనధికార వ్యక్తుల మాటలను నమ్మవద్దని సీఎండీ సూచించారు.

### శ్రావణమాసం నోకాంబిక అమ్మవారిని

# డబ్బు నోట్లతో అలంకరణ

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక గవరపాలెం లో వేంచేసి ఉన్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ నూకాంబిక శ్రావణ శుక్రవారం రెండవ వారం మహాలక్ష్మి దేవి పూజ పురస్కరించుకొని నోకాంబికా దేవాలయంలో అమ్మవారికి డబ్బులు నోట్లతో అలంకారం చేయడం జరిగింది అలాగే సామూహిక కుంకుమ పూజలు కూడా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో కుంకుమ పూజల పాల్గొనడం జరిగింది . అమ్మవారి విశ్వరూపాన్ని చూడడానికి భక్తులు తరలిరావడం జరిగింది ఆలయ పాలకవర్గ సభ్యులు చైర్మన్ పి నాగ శ్రీను( గొల్ల బాబు ) భక్తులకు తీర్థ ప్రసాదములు అందించడం జరిగింది







## ఎలక్ట్రిక్ బస్సులో మంత్రి మండిపల్లి

### పర్యావరణహిత రవాణాకు ప్రాధాన్యం

### భోగాపురం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణం

### ఎయిర్‌పోర్ట్‌కు ఎలక్ట్రిక్ బస్సు సేవలు పరిశీలన

**విశాఖపట్నం, ఆగస్టు 21, జయ జయహే :**

విశాఖలోని వుడా పార్క్ నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నూతనంగా ప్రారంభించిన ఎలక్ట్రిక్ బస్సులో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రయాణించారు. పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన రవాణా సదుపాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు పలువురు రవాణా అధికారులు ఉన్నారు.

# ప్రభుత్వ భూముల్లో 'బాక్సర్' పాగా...!

### నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేయడంలో ఘనాపాఠీ... టీడీపీ నాయకుల పేర్లు చెప్పి అడ్డగోలు దందా

**విశాఖపట్నం, ఆగస్టు 21, జయ జయహే**

విశాఖకు చెందిన ఒక మాజీ కార్పొరేటర్ భూ కబ్జాలతో రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు..'బాక్సింగ్' ఆడేస్తున్నారు. ప్రశ్నిస్తే పెద్దోళ్లంతా తన వారేనంటూ..నేను గంటా ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానం'టూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. వాస్తవానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆయనకు ఏ అధికార పార్టీ నేతతోనూ సత్సంబంధాలు లేవనేది టాక్. కానీ సర్కార్ స్థలాల్ని ఆక్రమించుకోవడమే తన ప్రవృత్తిగా మార్చుకున్న ఆ బాక్సర్‌పై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు ఆయన కన్నుపడినట్టేనని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఒక కేసు పెండింగ్‌లో ఉందని, వివిధ సర్వే నంబర్లలో బాక్సర్ అక్రమ నిర్మాణాలు, పనులు సాగిస్తూ హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అల్లిపురం వీధి, చినగదిలి, తిమ్మాపురం, నరసింహనగర్, సీతమ్మధార ప్రాంతాల్లో రాజు అక్రమాలు అన్నీఇన్నీ కావని, నకిలీ పత్రాలు సృష్టించి, దొంగ రిజిస్ట్రేషన్లు చేయించడంలో ఆయన ఘనాపాఠీ అంటున్నారు. కుటుంబ సభ్యుల్ని రంగంలోకి దించి, అంతో ఇంతో బాధితులకు ముట్టజెప్పినట్టు చేయించి, అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు ఆ బాక్సర్ అక్రమాలకు అంతే లేకుండా పోయిందని, కొన్నాళ్లు టీడీపీ సానుభూతిపరుడిగా తిరిగారని, ఆ పరిచయాలతోనే ఇప్పుడు అధికార టీడీపీలో పనులు చేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. సర్వే నంబర్ 275లో కొంతమంది చేత రమణ అనే వ్యక్తి సాయంతో పాకలు వేయించి వాటికి ఏడాదికి రూ. 25చొప్పున జీవీఎంసీలో కనీస ట్యాక్సు చెల్లించేలా చేసి, ఆ స్థలాల్ని మళ్లీ ఇతరులకు అమ్ముకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. అల్లిపురం వార్డు, బాలయ్య శాస్త్రి లేఅవుట్‌ను ఆనుకొని ఉన్న గెడ్డ జీవీఎంసీ ఓపెన్ స్పేస్ సమీపంలో ఎల్‌పీ 16/90లో 600గజాలు, చినగదిలిలోని సర్వే నంబర్ 164లో 1000గజాల్ని కనకరాజు, రాయపురాజు బాదరాజు అనే తన బినామీల పేరిట మండల రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నట్టు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే ద్వారా రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తూ ఆ స్థలాన్ని అమ్ముకునే యత్నంలో ఉండడంతో అధికారులకు



ఫిర్యాదు వెళ్లింది. ప్రభుత్వ స్థలాల్ని కాజేయడమే లక్ష్యంగా వాటిని ఆక్రమించి బినామీల పేరిట దొంగ పత్రాలు సృష్టిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. తిమ్మాపురంలోని జర్నలిస్టు కాలనీకి ఆనుకుని సర్వే నంబర్ 346లో ఎకరా స్థలాన్ని వేరొక వ్యక్తి నుంచి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తెలిసింది.

**- పాకలు వేయించి..దౌర్జన్యం చేయించి..!**

ఎక్కడైనా ప్రభుత్వ స్థలం కనిపిస్తే ఆ బాక్సర్ అక్కడ వాలిపోయి పేదలతో పాకలు వేయిస్తారనే ప్రచారం ఉంది. కొన్నాళ్ల తర్వాత ఆ స్థలాన్ని విక్రయించడం, స్థలాల్లో నిర్మాణాలు చేయించడం ఆయనకు రాటుదేలిన వృత్తి అని చెబుతున్నారు. ఆ కోవలోనే నరసింహనగర్‌లో కొన్ని పట్టాలు సృష్టించారని, ప్రశ్నించిన వారికి ఆ స్థలం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సంబంధించినదని చెబుతుండడంతో అధికారులు, స్థానికులు దరిదాపుల్లోకే రావడం లేదంటున్నారు. 600గజాల ప్రభుత్వ స్థలంలో తన పేరిట 500గజాల స్థలాన్ని రాయించాలంటూ ఒక వ్యక్తిని రంగంలోకి దించారని, గతంలో ఇదే విషయమై పోలీస్ స్టేషన్ వరకు పంచాయితీ వెళ్లిందని తెలిసింది. తన కుమార్తెను కూడా రంగంలోకి దింపి అనేక ప్రభుత్వ స్థలాల్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారనే ఆరోపణలున్నాయి. పాత 14వ వార్డులోని గ్యాస్ గోదాం వద్ద 100గజాల స్థలాన్ని కొట్టేశారని, దొంగపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో రంగంలోకి దిగితే ఆ మాజీ కార్పొరేటర్ అక్రమాలన్నీ వెలుగులోకి వస్తాయని స్థానికులు సూచిస్తున్నారు. చేసేవన్నీ చేసేసి తిరిగి నాయకుల పేర్లు చెప్పుకొంటున్న ఆయనపై ఏసీబీ, జిల్లా రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## రంగా రమేష్ నూతన గృహప్రవేశానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రంగా రమేష్ నూతనంగా నిర్మించుకున్న గృహంలో శుక్రవారం నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై రంగా రమేష్ కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ నూతన గృహాన్ని సందర్శించి రంగా రమేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీను, ముప్పిడి వెంకటేశ్వరరావు , బూరుగుపల్లి శేషారావు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మరెడ్డి శ్రీనివాసరావు, భూపతి ఆదినారాయణ , తదితరులు పాల్గొని రంగా రమేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గృహప్రవేశ కార్యక్రమం సందడిగా జరిగింది. నూతన గృహంలో రంగా రమేష్ కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని నాయకులు ఆకాంక్షించారు.



## భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

**మాడుగుల ఆగస్టు 21 జయ జయహే**

శ్రావణమాసం రెండో వారం శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రజలంతా పూజలు నిర్వహించుకున్నారు. శ్రావణమాసంలో రెండో వారానికి అత్యంత ప్రాధాన్య ఇస్తూ ప్రతి ఒక్కరు వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించుకుంటారు దానిలో భాగంగా ఈ వారం కూడా ప్రతి ఇంట్లో మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజ నిర్వహించి వివిధ రకాల నైవేద్యాలను పళ్ళును సమర్పించారు. ఈ సందర్భంగా నాలుగుల దుర్గాదేవి ఆలయంలోనూ వేణుగోపాల స్వామివారిని కన్యకా పరమేశ్వరి అమ్మవారి వెంకటేశ్వర ఆలయంలో మహాలక్ష్మి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు పెద్ద ఎత్తున భక్తుల హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాడుగుల మండలం ఎంకోడూరు లక్ష్మీనారాయణ ఆలయం, కే.జేపురం వెంకటస్వామి ఆలయంలో సంతోషిమాత ఆలయములను శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు ఘన ఘన నిర్వహించారు.



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**మాడుగుల, (ఎ.కోడూరు), ఆగస్టు 21: జయ జయహే**

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లాకు రానున్నారు. ఈ పర్యటనను పురస్కరించుకుని విశాఖపట్నం రేంజ్ ఐజి గోపినాథ్ జట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, శుక్రవారం కె.కోటపాడు మండలం, ఎ.కోడూరు గ్రామంలో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమ ప్రాంగణం, హెలిప్యాడ్, విఐపి రూట్ బందోబస్తు ఏర్పాట్లను ఉన్నతాధికారులు నిశితంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ గోపినాథ్ జట్టి మాట్లాడుతూ అలసత్వానికి తావులేదు: బందోబస్తు విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అత్యంత నిబద్ధత, అప్రమత్తతతో విధులు నిర్వహించాలి.

**స్పష్టమైన మార్గదర్శకాలు**

ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత విజయవంతం చేయడానికి సిబ్బందికి పాటించాల్సిన నియమావళి పై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సమన్వయం**

భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు రాకుండా వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మాడుగుల శాసనసభ నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి , స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర పోలీసు అధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.




## బంగ్లాదేశ్‌తో గంగా జల ఒప్పందాన్ని
# పునఃసమీక్షించాలి

(ప్రతాప్)

గంగా నది నీటి ప్రవాహాన్ని భారత్, బంగ్లాదేశ్‌లు ఎలా పంచుకోవాలన్న అంశంపై 1996లో కుదిరిన ఒప్పందం మూడు దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య జల సహకారానికి ఆధారంగా నిలిచింది. 1996 డిసెంబర్ 12న కుదిరిన ఈ ఒప్పందం 30 ఏళ్ల కాలానికి అమలులోకి వచ్చింది. 2026 డిసెంబర్‌తో దాని గడువు ముగియనున్న నేపథ్యంలో, మారుతున్న జల అవసరాలు, వాతావరణ పరిస్థితులు, జనాభా, వ్యవసాయం, పర్యావరణ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని దీనిని పునఃసమీక్షించడం అవసరం. ఇది వివాదానికి దారితీసే అంశంగా కాకుండా, భవిష్యత్ జల భద్రతకు సంబంధించిన సహకార ప్రక్రియగా చూడాలి.

ప్రస్తుత ఒప్పందం ఫరక్కా వద్ద జనవరి 1 నుంచి మే 31 వరకు పొడి కాలంలో గంగా ప్రవాహాన్ని పంచుకునే విధానాన్ని నిర్దేశిస్తుంది. ప్రవాహం 70,000 క్యూసెక్కులు లేదా అంతకంటే తక్కువగా ఉంటే ఇరుదేశాలు చెరో సగం నీటిని పొందుతాయి. 70,000 నుంచి 75,000 క్యూసెక్కుల మధ్య ప్రవాహం ఉంటే బంగ్లాదేశ్‌కు 35,000 క్యూసెక్కులు కేటాయిస్తారు. 75,000 క్యూసెక్కులు లేదా అంతకంటే ఎక్కువ ప్రవాహం ఉంటే భారత్‌కు 40,000 క్యూసెక్కులు, మిగిలిన ప్రవాహం బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. ఈ సూత్రాలు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. ఇప్పుడు వాటిని తాజా వాస్తవాల నేపథ్యంలో పరిశీలించాల్సిన సమయం వచ్చింది.

ప్రస్తుత అవసరాలు 1996తో పోలిస్తే గణనీయంగా మారాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, సాగునీటి విస్తరణ, పరిశ్రమల అవసరాలు నీటి వినియోగాన్ని పెంచాయి. మరోవైపు వర్షపాతం తీరులో మార్పులు, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు, భూగర్భజలాల అధిక వినియోగం గంగా పరివాహక ప్రాంతంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. 2026లో వెలువడిన ఒక పరిశోధన ప్రకారం 1980--2021 మధ్య గంగా పరివాహక ప్రాంతంలో నదీ ప్రవాహం సుమారు 17 శాతం తగ్గింది. ఈ మార్పులను పాత గణాంకాలతో మాత్రమే అంచనా వేయడం సముచితం కాదు.

కొత్త ఒప్పందంలో నీటి పరిమాణంతో పాటు పర్యావరణ ప్రవాహం, నదీ ఆరోగ్యం, మత్స్య సంపద, డెల్టా ప్రాంతాల రక్షణ, ఉప్పునీటి చొరబాటు, తాగునీటి అవసరాలు కూడా పరిగణనలోకి రావాలి. కరువు సంవత్సరాల్లో నీటి పంపిణీ ఎలా ఉండాలి, తీవ్రమైన వరదల సమయంలో సమాచారాన్ని ఎలా పంచుకోవాలి అనే అంశాలకు ముందుగానే స్పష్టమైన విధానం అవసరం.

ఇంకా ముఖ్యంగా, నీటి లభ్యతపై ఇరుదేశాల మధ్య నమ్మకాన్ని పెంచేది పారదర్శక సమాచారం. ఫరక్కా సహా కీలక కొలత కేంద్రాల నీటి ప్రవాహ సమాచారాన్ని ప్రత్యక్షంగా పంచుకోవడం, ఒకే శాస్త్రీయ ప్రమాణాలతో కొలతలు నిర్వహించడం, ఉపగ్రహ సాంకేతికతను వినియోగించడం, సంయుక్త నిపుణుల పర్యవేక్షణను బలోపేతం చేయడం ప్రయోజనకరం.

భారత్‌కు తన పరివాహక ప్రాంతంలోని తాగునీరు, సాగునీరు, పరిశ్రమలు, పర్యావరణ అవసరాలను సమతుల్యం చేయాల్సిన బాధ్యత ఉంది. దిగువ ప్రాంత దేశంగా బంగ్లాదేశ్‌కు పొడి కాలపు నీటి లభ్యతపై భరోసా అవసరం. కాబట్టి ఇది ఎవరు ఎంత నీరు పొందాలి అనే పోటీగా కాకుండా, అందుబాటులో ఉన్న నీటిని ఇరుదేశాల ప్రయోజనాలకు అనుగుణంగా సమ-ర్థంగా నిర్వహించే సహకారంగా చూడాలి.

1996 ఒప్పందాన్ని యథాతథంగా పొడిగించడం కంటే, తాజా శాస్త్రీయ సమాచారం ఆధారంగా అనువైన కొత్త వ్యవస్థను రూపొందించడం సముచితం. కరువు, వరదలకు ప్రత్యేక విధానాలు, పర్యావరణ రక్షణ, పారదర్శక సమాచార మార్పిడి, క్రమబద్ధమైన సమీక్ష వంటి అంశాలు అందులో ఉండాలి.

గంగను పంచుకోవడమే లక్ష్యం కాకూడదు; గంగను కాపాడుకుంటూ నీటి భద్రతను కలిసి నిర్మించడమే కొత్త ఒప్పందానికి అసలు లక్ష్యం కావాలి.



## అమ్మవారికి ఘనంగా నిర్వహించిన రాహుకాల పూజలు

అనకాపల్లి జయ జయహే

స్థానిక గవరపాలెం కోటవీధి వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ సర్వకామ దాంబ అమ్మవారికి శుక్రవారం రాహుకాలం నిమ్మకాయ దీపాలు తో కుంకుమ పూజ లు మహిళలు నిర్వహించుకోవడం జరిగింది అందులోని శ్రావణమాసం మహాలక్ష్మి వ్రత పూజ కలిసి రావడంతో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని ఈ పూజలు నిర్వహించుకోవడం జరిగింది. రాహుకాల పూజ తమ కోరికలు నెరవేర్చుకున్నట్టుకు అనుకున్న పనులు నెరవేరుటకు వివాహం కాని వారికి వివాహం జరుగుటకు సంతానం లేని వారికి సంతానం ఉద్యోగం లేని వారికి ఉద్యోగం కలుగుటకు ఎలాంటి మన మనసులో సంకల్పంతో రాహుకాలం నిమ్మకాయ దీపాలతో అమ్మవారిని కుంకుమ పూజతో కొలుచుకోవడం జరుగుతుంది ఇది 11 వారాలు లేదా 9 వారాలు లేదా 21 వారాలు సంకల్పం చెప్పుకొని ప్రతి శుక్రవారం ఈ పూజలు నిర్వహించుకోవడం జరుగుతుంది భక్తులు తమ కోరికలు నెరవేరుతూ ఉండడంతో ఈ పూజల పాల్గొన భక్తులు అధిక సంఖ్యలో రావడం జరుగుతున్నది దేవాలయ పాలకవర్గ సభ్యులు భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించడం జరుగుతున్నది

# యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సృష్టి సమాంతరంగా సాగాలి

(ప్రతాప్)



**భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న సమయంలో, ఆ వృద్ధి ఫలాలు ఉద్యోగాల రూపంలో ఎంత విస్తృతంగా ప్రజలకు చేరుతున్నాయన్నది కీలకంగా మారింది. తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం 2026 ఏప్రిల్--జూన్ త్రైమాసికంలో 15 సంవత్సరాలు, అంతకంటే పైబడిన వారిలో దేశవ్యాప్త నిరుద్యోగ రేటు 5.4 శాతంగా నమోదైంది. జనవరి--మార్చి త్రైమాసికంలోని 5.0 శాతంతో పోలిస్తే ఇది 0.4 శాతం పాయింట్ల పెరుగుదల. అయితే ఈ ఒక్క సంఖ్యతో భారత ఉద్యోగ మార్కెట్ పరిస్థితిని అంచనా వేయడం సరైంది కాదు.**

ప్రాంతాల వారీగా చూస్తే గ్రామీణ నిరుద్యోగం 4.8 శాతం, పట్టణ నిరుద్యోగం 6.7 శాతంగా ఉంది. గ్రామీణ రేటు కూడా గత త్రైమాసికంలోని 4.3 శాతం నుంచి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో విద్యార్హతలకు అనుగుణమైన ఉద్యోగాల కోసం పెరుగుతున్న పోటీ, అవకాశాల కేంద్రీకరణ, నైపుణ్యాల సరిపోలిక వంటి అంశాలు ఈ వ్యత్యాసాన్ని ప్రభావితం చేయవచ్చు.

అయితే అత్యంత ముఖ్యమైన అంశం యువ నిరుద్యోగం. 15--29 సంవత్సరాల యువతలో నిరుద్యోగం 15.9 శాతంగా ఉంది. గ్రామీణ యువతలో 14.7 శాతం, పట్టణ యువతలో 18.2 శాతంగా నమోదైంది. విద్య నుంచి ఉద్యోగానికి మారే దశలో యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం, అప్రెంటిస్‌షిప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, కెరీర్ మార్గదర్శకత్వం మరింత అవసరమని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

ఇక్కడ ఉద్యోగాల సంఖ్యతో పాటు ఉద్యోగ నాణ్యత కూడా ముఖ్యమే. స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధికి అవకాశం, కెరీర్ పురోగతి కలిగిన ఉద్యోగాలు ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ విలువను అందిస్తాయి. అందువల్ల భవిష్యత్ ఉపాధి వ్యూహం "ఎన్ని ఉద్యోగాలు?"తో పాటు "ఎలాంటి ఉద్యోగాలు?" అనే ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వాలి.

మహిళల ఉపాధి భాగస్వామ్యం మరో కీలక అంశం. పట్టణ మహిళల నిరుద్యోగ రేటు 8.7 శాతం, పట్టణ పురుషుల రేటు 6.1 శాతంగా ఉంది. రవాణా, భద్రత, శిశు సంరక్షణ, అనువైన పనివేళలు, నైపుణ్య శిక్షణ వంటి అంశాలు మహిళల ఉద్యోగ భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయి. మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించడం సామాజిక పురోగతితో పాటు దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచే ఆర్థిక అవకాశంగా చూడాలి.

మరో ముఖ్యమైన సూచిక లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్ పి ఎఫ్ ఆర్). ఏప్రిల్--జూన్ 2026లో మొత్తం ఎల్ పి ఎఫ్ ఆర్ 54.6 శాతంగా ఉంది. గత త్రైమాసికంలోని 55.5 శాతంతో పోలిస్తే ఇది తగ్గింది. ఉద్యోగం కోసం ప్రయత్నించడం మానేసిన వ్యక్తి నిరుద్యోగిగా కాకుండా శ్రామిక శక్తి వెలుపల ఉన్న వ్యక్తిగా లెక్కించబడవచ్చు. అందుకే నిరుద్యోగ రేటుతో పాటు ఎల్ పి ఎఫ్ ఆర్ , వర్కర్ జనాభా నిష్పత్తి , వేతనాలు, పని గంటలు, ఉద్యోగ స్థిరత్వం వంటి సూచికలను కూడా పరిశీలించాలి.

జూన్ 2026 నెలవారీ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే గణాంకాల్లో నిరుద్యోగ రేటు 5.5 శాతంగా నమోదైంది. దీనిని ఏప్రిల్--జూన్ త్రైమాసికపు 5.4 శాతంతో నేరుగా పోల్చకూడదు. ఒకటి నెలవారీ గణాంకం కాగా, మరొకటి మూడు నెలల కాలానికి సంబంధించినది. సీజనల్ మార్పులు కూడా నెలవారీ ఉద్యోగ గణాంకాలను ప్రభావితం చేయవచ్చు.

భారత్‌కు గ్రామీణ ఉపాధి విస్తరణ కూడా అవసరం. ఆహార ప్రాసెసింగ్, గిడ్డంగులు, కోల్డ్ చైన్, లాజిస్టిక్స్, గ్రామీణ పర్యాటకం, చిన్న పరిశ్రమలు, డిజిటల్ సేవలు వంటి వ్యవసాయేతర రంగాలను విస్తరించడం ద్వారా స్థానిక ఉపాధి అవకాశాలను పెంచవచ్చు. అదే సమయంలో టైర్-2, టైర్-3 నగరాలను కొత్త ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా మెట్రో నగరాలపై ఉద్యోగ ఒత్తిడిని తగ్గించవచ్చు.

తయారీ రంగం కూడా ఉద్యోగ సృష్టికి ప్రధాన ఆధారం. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధాలు, ఆటోమొబైల్స్, యంత్రసామగ్రి, పునరుత్పాదక ఇంధన పరికరాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెరిగితే ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు సరఫరా గొలుసులో పరోక్ష ఉపాధి కూడా పెరుగుతుంది. సేవారంగంలో ఆఈ, డిజిటల్ సేవలు, ఫిన్‌టెక్, ఆరోగ్య సేవలు, పరిశోధన, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలు అధిక విలువ కలిగిన కొత్త అవకాశాలను సృష్టించగలవు.

ఈ అవకాశాలను వినియోగించుకోవాలంటే విద్య--నైపుణ్యం--పరిశ్రమ మధ్య అనుసంధానం బలపడాలి. డిగ్రీల సంఖ్య కంటే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు ముఖ్యం. అప్రెంటిస్‌షిప్‌లు, పరిశ్రమ భాగస్వామ్యంతో శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, డిజిటల్ సామర్థ్యాలు యువతను ఉద్యోగ మార్కెట్‌కు మరింత సిద్ధం చేయగలవు.

భారత్ 20 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని పరిశీలించినా ఉద్యోగాల సృష్టి కీలకం. ఆర్థిక వృద్ధి ప్రజల ఆదాయాలు, వినియోగం, జీవన ప్రమాణాలను మెరుగుపరచాలంటే అది ఉద్యోగాలను సృష్టించే, ఉత్పాదకతను పెంచే, విస్తృతంగా పంచబడే వృద్ధిగా ఉండాలి. యువ జనాభా భారతదేశానికి గొప్ప ఆర్థిక వనరు; వారికి సరైన నైపుణ్యాలు, అవకాశాలు లభిస్తే అదే జనాభా దేశ అభివృద్ధికి ప్రధాన శక్తిగా మారుతుంది.

కాబట్టి 5.4 శాతం నిరుద్యోగ రేటును కేవలం ఆందోళనగా కాకుండా ఉపాధి వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు ఒక సూచికగా చూడాలి. యువతకు మొదటి ఉద్యోగం, మహిళలకు విస్తృత అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి, పట్టణాల్లో నాణ్యమైన ఉద్యోగాలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు---ఇవన్నీ సమన్వయంగా ముందుకు సాగాలి.

చివరికి భారతదేశం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న కేవలం నిరుద్యోగ రేటును తగ్గించడం కాదు. ప్రతి యువ ప్రతిభకు సరైన అవకాశం, ప్రతి నైపుణ్యానికి తగిన పని, ప్రతి ప్రాంతానికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం అసలు లక్ష్యం కావాలి. ఆర్థిక వృద్ధి, ఉత్పాదకత, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సృష్టి కలిసి ముందుకు సాగినప్పుడే భారత జనాభా శక్తి నిజమైన ఆర్థిక బలంగా మారుతుంది.

# వరదల గుప్పిట్లో మన నగరాలు

(సి.హెచ్.ప్రతాప్)

**వర్షం ప్రకృతి వరం. కానీ అదే వర్షం నగరాలను ముంచెత్తుతున్నదంటే అది కేవలం ప్రకృతి వైపరీత్యంగా భావించి చేతులు దులుపుకోలేం. పట్టణ ప్రణాళికలో లోపాలు, సహజ నీటి మార్గాల విధ్వంసం, అధ్వాన డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ వైఫల్యం, ఆక్రమణలు, పాలనా సంస్థల మధ్య సమన్వయ లోపం.. ఇవన్నీ కలిసి పట్టణ వరదలను విపత్తుగా మారుస్తున్నాయి. వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ వ్యవస్థలు మెరుగుపడుతున్నా ఏటా అదే నగరాలు ముంపునకు గురవుతుండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. వర్షం కొత్తది కాదు.. వరద కొత్తది కాదు.. అయినా శాశ్వత పరిష్కారం ఎందుకు కనిపించడం లేదు?**



2023 నుంచి దేశంలోని పలు నగరాలు పట్టణ వరదల తీవ్రతను చవిచూశాయి. 2023 జులైలో ఢిల్లీలో యమునా నీటిమట్టం 208.66 మీటర్లకు చేరడంతో రాజ్‌ఘాట్, ఐటీఓ, రింగ్‌రోడ్ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అదే ఏడాది డిసెంబరులో 'మిచాంగ్' తుపాను చెన్నైని అతలాకుతలం చేసింది. నాగ్‌పూర్‌లో భారీ వర్షాలకు నాగ్ నది పొంగిపొర్లింది. 2024లో పుణెలో కుండపోతకు తోడు ఖడక్‌వాస్లా జలాశయం నుంచి వచ్చిన అధిక ప్రవాహం ముంపును తీవ్రతరం చేసింది. విజయవాడలో భారీ వర్షాలు, బుడమేరు ప్రవాహం కలిసి నగరాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. వడోదరలో విశ్వామిత్రి నది పొంగిపొర్లడం, ముంబయిలో భారీ వర్షాలు--అధిక ఆటుపోట్లు రహదారులు, రవాణా వ్యవస్థను స్తంభింపజేయడం పట్టణ వరదల తీవ్రతను తెలియజేస్తున్నాయి. 2025, 2026లోనూ హైదరాబాద్, గువాహటి తదితర నగరాలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి.

భారీ వర్షమే వరదకు ప్రధాన కారణమని చెప్పడం సరికాదు. వర్షపు నీరు వెళ్లే దారులను మనమే మూసేస్తున్నాం. నగర విస్తరణలో చెరువులు, కుంటలు, తడిమైదానాలు, వాగులు, నాలాలు, వరద మైదానాలపై నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఒకప్పుడు వర్షపు నీటిని ఒడిసిపట్టి క్రమంగా భూమిలోకి ఇంకేలా చేసిన సహజ జలవనరులు కనుమరుగవుతున్నాయి. బెంగళూరులో చెరువుల పరస్పర అనుసంధాన వ్యవస్థ దెబ్బతినడం, ముంబయిలో మిఠీ నది పరివాహక ప్రాంతంపై ఒత్తిడి, విజయవాడలో బుడమేరు ప్రవాహ మార్గానికి అడ్డంకులు దీనికి ఉదాహరణలు.

దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థలు నేటి జనాభా, కాంక్రీటీకరణ, వర్ష తీవ్రతకు సరిపోవడం లేదు. కాలువల్లో ప్లాస్టిక్ చెత్త పేరుకుపోవడం, సకాలంలో పూడిక తీయకపోవడం వాటి సామర్థ్యాన్ని మరింత తగ్గిస్తున్నాయి. భవనాలు, రహదారులు, పార్కింగ్ స్థలాలు పెరిగేకొద్దీ నేలలోకి నీరు ఇంకే అవకాశం తగ్గుతోంది. ఫలితంగా కొద్ది గంటల భారీ వర్షం కురిసినా రోడ్లే వాగులుగా మారుతున్నాయి.

వాతావరణ మార్పులు సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. తక్కువ సమయంలో అత్యధిక వర్షం కురిసే తీవ్రమైన వర్ష ఘటనలు పెరుగుతున్నాయి. మరోవైపు జలాశయాల నిర్వహణలోనూ ముందుచూపు అవసరం. భారీ వర్షాల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహం, జలాశయాల నీటిమట్టం, దిగువ ప్రాంతాల పరిస్థితి, వర్ష సూచనలను సమన్వయం చేసుకుని నీటి విడుదలను నిర్ణయించాలి. లేకపోతే ప్రకృతి విపత్తుకు మానవ నిర్ణయాలు అదనపు భారమవుతాయి.

పట్టణ వరదల మూల్యం ప్రాణనష్టం వరకే పరిమితం కాదు. రహదారులు, రైళ్లు, విమానాశ్రయాలు, విద్యుత్ వ్యవస్థలు, వ్యాపార సంస్థలు దెబ్బతింటాయి. సరఫరా వ్యవస్థలు నిలిచిపోతాయి. నిలిచిన నీటితో డెంగ్యూ, మలేరియా, లెప్టోస్పిరోసిస్, ఇతర నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుంది. 2024లో ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్‌నగర్‌లో వరదనీరు బేస్‌మెంట్‌లోకి చేరి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతిచెందిన ఘటన పట్టణ భద్రతా ప్రమాణాలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది.

ఇకపై వరద వచ్చిన తర్వాత సహాయక చర్యలు చేపట్టే విధానం సరిపోదు. వరద ముప్పును ముందుగానే తగ్గించే సమగ్ర పట్టణ ప్రణాళిక అవసరం. ప్రతి నగరానికి అర్బన్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాలి. చెరువులు, నాలాలు, వాగులు, తడిమైదానాలు, వరద మైదానాలను డిజిటల్‌గా మ్యాప్ చేసి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి. డ్రైనేజీ వ్యవస్థలను ప్రస్తుత, భవిష్యత్ వర్ష తీవ్రతకు అనుగుణంగా పునర్నిర్మించాలి. వర్షాకాలానికి ముందే పూడికతీత, కాలువల శుభ్రతను పూర్తిచేయాలి.

నగరాలను 'స్పాంజ్ సిటీలుగా' మార్చే దిశగా గ్రీన్ స్పేస్‌లు, అర్బన్ ఫారెస్టులు, రైన్ గార్డెన్లు, గ్రీన్ రూఫ్‌లు, నీరు ఇంకే పేవ్‌మెంట్లు పెంచాలి. జీఐఎస్, కృత్రిమ మేధ, ఐఓటీ సెన్సర్లు, హైపర్‌లోకల్ వాతావరణ అంచనాలతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలి. మున్సిపాలిటీలు, వాతావరణ శాఖ, కేంద్ర జల సంఘం, విపత్తు నిర్వహణ సంస్థలు, పోలీసు, అగ్నిమాపక శాఖల మధ్య సమన్వయం నిరంతరం ఉండాలి. పట్టణ స్థానిక సంస్థలకు తగిన నిధులు, సాంకేతిక నైపుణ్యం, స్పష్టమైన బాధ్యతలు కల్పించాలి.

చెరువు ఖాళీ స్థలం కాదు.. నాలా మురుగు కాలువ కాదు.. అవే నగరానికి సహజ వరద రక్షణ వ్యవస్థలు. వాటిని కాపాడటం అభివృద్ధికి అడ్డంకి కాదు; భవిష్యత్ తరాల భద్రతకు పెట్టుబడి. వర్షాన్ని ఆపలేం. కానీ వరదను నియంత్రించగలం. ప్రతి వర్షాకాలంలో "ఎంత వర్షం పడింది?" అని కాదు.. "పడిన నీటిని ఎంత సమర్థంగా నిర్వహించాం?" అని ప్రశ్నించే పాలనా సంస్కృతి రావాలి. అప్పుడే మన నగరాలు వరదలకు బలయ్యే పట్టణాల నుంచి వాతావరణ మార్పులను తట్టుకునే సురక్షిత నగరాలుగా మారతాయి.

# అర్చకులపై దౌర్జన్యం చేస్తే ఊరుకోం

### అర్చక రక్షణే - ఆలయ రక్షణ": -
### హద్దులు మీరితే బుద్ధి చెబుతాం...
### గాయత్రి బ్రాహ్మణ ఐక్యవేదిక హెచ్చరిక

**చోడవరం, ఆగస్టు 21, జయ జయహే**




దేవాలయాల్లో అర్చకుల పట్ల ఆలయ కమిటీలు అనుచితంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతూ దౌర్జన్యాలకి తెగబడడాన్ని చోడవరం గాయత్రి బ్రాహ్మణ ఐక్యవేదిక ఖండిస్తోంది. విశాఖపట్నం, అక్కయ్యపాలెం లో శుక్రవారం మేడూరి శ్రీనివాస్ కు ఎదురైన సంఘటనపై చోడవరం గాయత్రి బ్రాహ్మణ ఐక్య వేదిక ఆందోళన వ్యక్తం చేశారు.ఆలయ పవిత్రతను, అర్చకుల గౌరవాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో, హద్దులు మీరి ప్రవర్తిస్తున్న కమిటీ సభ్యులకు బ్రాహ్మణ సంఘాల నేతలు బహిరంగ హెచ్చరిక జారీ చేశారు. "భగవంతుడికి, భక్తులకు నడుమ వారధిగా ఉంటూ నిత్యం దైవ సేవలో తరించే అర్చకులను దూషించడం, వారిపై భౌతిక దాడులకు దిగడం తీవ్రమైన అహంకార పూరిత చర్య. ఇది కేవలం అర్చకులను అవమానించడం కాదు, ఆ సాక్షాత్తు భగవంతుడిని,ఆలయ పవిత్రతను అపహాస్యం చేయడమే. పదవులు శాశ్వతం కావని కమిటీ సభ్యులు గుర్తుంచుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి, సేవా కార్యక్రమాల పర్యవేక్షణకు మాత్రమే పదవులు వచ్చాయి తప్ప, అర్చకులపై దౌర్జన్యం చేయడానికి లేదా మీ వ్యక్తిగత అహాన్ని ప్రదర్శించడానికి కాదు" అని గాయిత్రి బ్రాహ్మణ ఐక్యవేదిక తీవ్రంగా మండి పడుతోంది. భక్తులు ఇచ్చే కానుకలతో నడిచే ఆలయాల్లో ఉంటూ, అర్చకులను హింసిస్తే సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు "కమిటీ సభ్యుల అనాగరిక ప్రవర్తన వల్ల ఆలయాల కీర్తి ప్రతిష్టలు గంగలో కలుస్తున్నాయి. అర్చకులను దూషించడం, శారీరక దాడికి పాల్పడటం చట్టప్రకారం తీవ్రమైన నేరం అన్నారు. అర్చకుల పట్ల దురుసుగా ప్రవర్తించిన కమిటీ సభ్యులు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి.ఆలయ ఆవరణలో అర్చకులకు పూర్తి రక్షణ, గౌరవం కల్పించాలని, హద్దులు మీరి ప్రవర్తించే సభ్యులను కమిటీల నుండి తక్షణమే తొలగించాలని, "అర్చక రక్షణే - ఆలయ రక్షణ" అని పేర్కొంటూ, సంస్కారం లేని చోట దైవత్వం నిలవదని, ఇప్పటికైనా అహంకారాన్ని పక్కన పెట్టి అర్చకులను గౌరవించాలని హితవు పలికారు. లేని పక్షంలో భక్తులందరినీ కలుపుకుని తీవ్రస్థాయిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు, పురోహితులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



## రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుకు
# 'క్లబ్ ఎక్సలెన్స్ అవార్డు'

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 పరిధిలోని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు 2025-26 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన "క్లబ్ ఎక్సలెన్స్ అవార్డును కైవసం చేసుకుంది. క్లబ్ సభ్యులు అందించిన విశిష్ట సేవలు, సమాజ ప్రయోజనకరమైన కార్యక్రమాలు మరియు రోటరీ ఆశయాల సాధనకు కృషి చేసినందుకు గాను ఈ గౌరవం లభించింది.ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలకు గాను కమ్యూనిటీ సర్వీస్, వొకేషనల్ సర్వీస్, న్యూ జనరేషన్ సర్వీస్, పబ్లిక్ ఇమేజ్, డిసీజ్ ప్రివెన్షన్, వాటర్ అండ్ శానిటేషన్, మాతృశిశు సంక్షేమం తదితర విభాగాలలో పలు అవార్డులు అందుకోవడం విశేషం.ఈ ఘనత సాధించడంపై 2025-26 రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, సెక్రెటరీ దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, ట్రెజరర్ గుంటుపల్లి సత్య సాయి మరియు వారి క్లబ్ సభ్యులందరికీ పలువురు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. సభ్యులందరి కృషి, అంకితభావం మరియు సేవాతత్వమే ఈ విజయానికి కారణమని, రాబోయే రోజుల్లో ఈ విజయం మరెన్నో సేవా కార్యక్రమాలకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు.



# జనసేన పార్టీలో చేరికలు

**అచ్యుతాపురం, ఆగస్టు 21, జయ జయహే:**

ఎలమంచిలి నియోజక వర్గం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా అచ్యుతాపురం ఎస్ టి బి ఎల్ వద్ద జరిగిన కార్యక్రమంలో కాశీ పాలెం గ్రామానికి చెందిన పీల కోటేశ్వరరావు తదితరులు సుమారు పదిమంది వారి కుటుంబ సభ్యులతో జనసేన పార్టీలో జనసేన ఉత్తరాంధ్ర ఇన్చార్జి సుందరపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి సుందరపు సతీష్ కుమార్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

# ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రమా లక్ష్మీదేవి

**కాకినాడ, ఆగస్టు 21(:జయ జయహే)**



కాకినాడ ఆర్టీసీ డిపో నూతన డిపో మేనేజర్‌గా గంగుమళ్ల రమా లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అమలాపురం డిపోలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఆమెకు పదోన్నతిపై కాకినాడ డిపో మేనేజర్‌గా నియామకం లభించింది. ఇటీవల కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారిగా పదోన్నతి పొందిన ఎంయువి మనోహర్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎ మాలిమ్ భాష, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) కే శ్రీనివాస్‌తో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు



## ప్రణయ్ తేజ్ కుటుంబాన్ని
# పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

### గల్లంతైన అప్పన్న కుటుంబానికి అండగా ఉంటామని హామీ

**విశాఖపట్నం, ఆగస్టు 21, జయ జయహే**

విశాఖ టౌన్ కొత్త రోడ్డు లిటిల్ గార్డెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రణయ్ తేజ్ ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం ప్రణయ్ తేజ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రణయ్ తేజ్ తల్లిదండ్రులను కలిసి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారిని కోల్పోయిన తల్లిదండ్రుల మనోవేదన వర్ణించలేనిదని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

**గల్లంతైన అప్పన్న కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ..!**

అనంతరం 37వ వార్డులోని ఫిషింగ్ హార్బర్ సమీపంలో వేట ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతైన అప్పన్న కుటుంబ సభ్యులను వారి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పన్న గల్లంతైన ఘటన అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి కుటుంబానికి అందాల్సిన సహాయం త్వరగా అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, బోట్ అసోసియేషన్ పెద్దలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# లోకుల గాంధీ ఐదవ వర్ధంతి

### ఘనంగా నివాళులర్పించిన బీజేపీ కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు.

**అనంతగిరి, 21: (జయ జయహే)**

భారతీయ జనతా పార్టీకి సుదీర్ఘ సేవలందించి, ప్రజాసేవే పరమావధిగా జీవించి, ప్రజా క్షేత్రంలోనే అసువులు బాసిన ఐఐటీ మద్రాస్ ప్రధాన కార్యదర్శి స్వర్గీయ లోకుల గాంధీ ఐదవ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు, అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... "లోకుల గాంధీ పార్టీ బలోపేతానికి, ప్రజా సంక్షేమానికి చేసిన సేవలు ఎనలేనివి. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి ఆయన. ప్రజా క్షేత్రంలోనే ఆయన తుదిశ్వాస విడవడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొయ్యూరులో ఘనంగా
# వరలక్ష్మి పూజలు..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 22,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుండే మహిళలు నూతన వస్త్రాలు ధరించి, ఇళ్లను శుభ్రం చేసుకుని వరలక్ష్మి దేవి పూజ కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. అమ్మవారిని పూలతో అలంకరించి, పసుపు, కుంకుమ, తోరాలు, పండ్లు, నైవేద్యాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. కుటుంబ సౌభాగ్యం, భర్త ఆయురారోగ్యాలు, సిరిసంపదల కోసం మహిళలు ఈ వ్రతాన్ని భక్తితో ఆచరించారు. పలు ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొయ్యూరులోని పలు గృహాల్లో సామూహికంగా వరలక్ష్మి వ్రత కథను చదువుకుని, ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. దీంతో మండలమంతా భక్తిమయ వాతావరణం నెలకొంది.

# సీఎం పర్యటన విజయవంతం చేయండి

**మాడుగుల ఆగస్టు 21 జయ జయహే**



స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛందర కార్యక్రమంలో భాగంగా శనివారం మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల కే కోటపాడు మండలం ఏ కోడూరు గ్రామాన్ని సందర్శిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాబట్టి నియోజవర్గ పరిధిలో గల గల 4 మండలాలు కి చెందిన పార్టీ కార్యకర్తలు నాయకులు కూటమి చెందిన కార్యకర్తలు, నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

# సీఎం పర్యటన.. ట్రాఫిక్ ఆంక్షలు

### పార్కింగ్ స్థలాల వివరాలు
### అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా

**మాడుగుల, (ఎ.కోడూరు), ఆగస్టు 21:**

మాడుగుల నియోజవర్గ పరిధిలో గల కె.కోటపాడు మండలం,ఎ.కోడూరు గ్రామంలో శనివారం "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్నారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, వాహనదారులు, కార్యక్రమానికి వచ్చే కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృతమైన ట్రాఫిక్ డైవర్షన్లు పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 22 ఉదయం 7:00 గంటల నుండి ఎ.కోడూరు మీదుగా ఎటువంటి వాహనాల రాకపోకలను అనుమతించబోరని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్ మళ్లింపులు (డైవర్షన్లు):**

పినగాడి నుండి దేవరాపల్లి: వెళ్లే భారీ వాహనాలు కొత్తవలస మీదుగా వెళ్ళాలి.

దేవరాపల్లి నుండి విశాఖపట్నం: వెళ్లే వాహనాలు కొత్తవలస మీదుగా పయనించాలి.

దేవరాపల్లి నుండి అనకాపల్లి, చోడవరం: వెళ్లే వాహనాలు లంకవానిపాలెం, పింద్రంగి, దాలివలస, రామచంద్రాపురం, కె. కోటపాడు మీదుగా వెళ్ళాలి.

వెంకన్నపాలెం నుండి దేవరాపల్లి: వెళ్లే వాహనాలు చౌడువాడ నుండి పాచిలవానిపాలెం మీదుగా వెళ్ళవలసిందిగా కోరడమైనది.



**కార్యక్రమానికి వచ్చేవారి కోసం పార్కింగ్ ఏర్పాట్లు**

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసే ప్రజలు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

వి.మాడుగుల, చౌడువాడ, గౌండుపాలెం, రొంగలినాయుడు-పాలెం, పైడంపేట, పాసిలవాణిపాలెం, అలాగే సూదివలస, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, కె.కోటపాడు, గొట్లం, పాతవలస గ్రామాల నుండి వచ్చే వారు చోడవరం లేదా కె.కోటపాడు రావాలమ్మ తల్లి గుడి, మెడీచర్ల మీదుగా వచ్చి సూరెడ్డిపాలెం వద్ద ఉన్న లేఅవుట్ లో తమ వాహనాలను పార్క్ చేసుకోవాలి.

చీడికాడ,దేవరాపల్లి మండలాల నుండి వచ్చే వారు తురువోలు, ఆలమండ లేదా ఆనందపురం మార్గాల్లో వచ్చి ఎ.కోడూరులోని రంగరాయ చెరువు వద్ద కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

లంకవానిపాలెం, కొరువాడ, ఆనందపురం, వి.సంతపాలెం, డి.అగ్రహారం,వారడ గ్రామాల ప్రజలు ఎ.కోడూరులోని గంగరాజు చెరువు వద్ద, దాలివలస, సింగన్నదొరపాలెం వాసులు సూరెడ్డిపాలెం గ్రామంలోని సా మిల్ వద్ద వాహనాలు నిలుపుకోవాలి.

మర్రివలస, శృంగవరం, పింద్రంగి, గవరపాలెం, కే జే పురం, కొత్త అగ్రహారం గ్రామాల నుండి వచ్చే వారు ఎ.కోడూరు గవర్నమెంట్ హాస్టల్ ఎదురుగా ఉన్న గాయత్రి స్కూల్ ఆవరణలో పార్కింగ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

**ముఖ్య గమనిక:**

కోటపాడు జంక్షన్ నుండి వారాడ గ్రామం వరకు రహదారిపై ఎటువంటి వాహనాలను నిలపడం పూర్తిగా నిషేధించడమైనది.

ప్రజలందరూ ఈ ట్రాఫిక్ సూచనలను గమనించి, పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, కోరారు.

For a pure tomorrow.. జయహే

# రిటైర్డ్ ఉద్యోగులను నమ్మించి రూ. కోటి కొట్టేశారు

### పుడమి ఆర్గానిక్ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ పేరుతో భారీ మోసం

### సీఐడీ కేసు నమోదు....

### ఇద్దరు అరెస్టు....ఆపై జైలుకు

**విశాఖపట్నం, ఆగస్టు 21, జయ జయహే**

పుడమి డెవలపర్స్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగులు, ఇతరులకు భూములు విక్రయిస్తామని నమ్మించి, భూమి లేకపోయినా ఉన్నట్లు చూపించి తప్పుడు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తూ సుమారు రూ.1.05 కోట్ల మేర మోసానికి పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐడి డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్, విశాఖపట్నం ఎస్పీ శ్రీధర్, విశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ జి. ప్రేమ కాజల్ ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారి పి. లక్ష్మి మోసగించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాకకు చెందిన చోడుపల్లి మాధవరావుతో పాటు మరో ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఏపీ సీఐడీ డీజీపీ ఆదేశాలపై సీఐడి పోలీస్ స్టేషన్ మంగళగిరిలో క్రైం నెంబర్ 12/2026 అండర్ సెక్షన్ 420, 409, 120(బీ) ఆర్ డబ్ల్యు 34 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా, నిందితులు ఎ-2



మేడిశెట్టి అప్పలనాయుడు మరియు ఏ-3 కోన పెద్దకాపు కలిసి పుడమి డెవలపర్స్ పేరుతో, విజయనగరం జిల్లా వేపాడ మండలం కరకవలస గ్రామంలోని సర్వే నెం.5-1లో సుమారు 99 ఎకరాల్లో లేఅవుట్ ఏర్పాటు చేసి, శ్రీగంధం మరియు ఇతర పండ్ల మొక్కలు పెంచి భూమిని అభివృద్ధి చేస్తామని ప్రజలను నమ్మించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో భూమి అందుబాటులో లేకపోయినా ఉన్నట్లు చూపించి, కొంతమంది వ్యక్తులకు ఒకే భూమిని డబుల్ రిజిస్ట్రేషన్లు చేయడం, తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా డబ్బులు వసూలు చేయడం వంటి మోసపూరిత చర్యలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుల నుంచి సుమారు రూ.1,05,03,000 నగదు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కార్యాలయాన్ని మూసివేసి నిందితులు పరారైనట్లు దర్యాప్తులో తేలింది. పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కోసం సీఐడి పోలీసులు దర్యాప్తు చేపట్టగా వారిని గురువారం అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో పాటు కోర్టులో హాజరు పరచగా ఏ-2 మేడిశెట్టి అప్పలనాయుడు, ఏ-3 కోన పెద్దకాపులను రిమాండ్ విధించినట్టు సీఐడి అధికారులు ప్రకటించారు. ఈ కేసులో మిగిలిన నిందితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని సీఐడి అధికారులు తెలిపారు. అలాగే, పరారీలో ఉన్న ముద్దాయిలను పట్టుకున్నందుకు సీఐడీ డీజీపీ విశాఖపట్నం రీజనల్ ఆఫీస్ అధికారిణి డాక్టర్. ప్రేమ కాజల్, దర్యాప్తు అధికారిణి పి. లక్ష్మిని అభినందించారు.

# లోకుల గాంధీ 5వ వర్ధంతి మహాసభ

### నడింపాలెంలో మన ఊరు - మన జెండా ఆవిష్కరణ





**కొయ్యూరు (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 22**

విద్యావంతుడు, నిస్వార్థ సేవకుడు, ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాత అయిన లోకుల గాంధీ 5వ వర్ధంతి మహాసభ నడింపాలెం కూడలిలో జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మన ఊరు - మన జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు, వారి అభిమానులు వేల సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 60 మంది యువత, మహిళలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం విశేషం. అలాగే నిరుపేదలకు 300 మందికి గొడుగులు పంపిణీ చేశారు. పాల్గొన్న నాయకులందరికీ జ్ఞాపికలు (మెమెంటోలు) అందజేశారు. రాష్ట్ర బీజేపీ కార్యదర్శి శ్రీమతి స్వప్న కుమారి మాట్లాడుతూ -లోకుల గాంధీ మాకు సమాజం పట్ల అంకిత భావాన్ని నేర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏంఎల్ఏ సత్యనారాయణ , రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు ,యువమోర్చా అల్లూరి జిల్లా ఇంచార్జి అడిగర్ల సతీష్ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు , కొయ్యూరు టీడీపీ మండల అధ్యక్షులు కాకూరి చంద్రరావు , సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ , వైసీపీ కొయ్యూరు మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు , జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు , ఉపాధ్యక్షులు జైతు ప్రభాకర్ గారు, కొయ్యూరు మండల బీజేపీ అధ్యక్షులు సంపరి శివకుమార్ తదితర అన్ని పార్టీల జిల్లా, మండల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

# ఇండియన్ బ్యాంక్ అంటేనే "ఒక నమ్మకం"

**పొట్టిశ్రీరాములు కూడలి (జయ జయహే )**

ఇండియన్ బ్యాంక్ శ్రీకాకుళం పాత బస్టాండ్ శాఖలో ఘనంగా ఖాతాదారుల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఇండియన్ బ్యాంక్ తన ప్రస్థానంలో 119 సంవత్సరాలు పూర్తిచేసుకుని, 120వ సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా, స్థానిక పాత బస్టాండ్ శాఖలో ఖాతాదారుల దినోత్సవాణ్ని నిర్వహించారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా 1907 ఆగస్టు 15 భారతదేశ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించే నిమిత్తం, చెట్టియర్లు చెన్నైలో మొట్టమొదటిసారిగా ఇండియన్ బ్యాంక్ సేవలు ప్రారంభించారని, కార్యక్రమానికి అధ్యక్షులుగా వ్యవహరించిన బ్యాంకు మేనేజర్ మూల.నారాయణరావు అన్నారు. ఇందులో భాగముగా మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ నేటికి 6003 శాఖలతో, 5676 ఏటీఎంలతో, 15 లక్షల ఇరవై తొమ్మిది వేల కోట్ల లావాదేవీలతో ఆధునిక సాంకేతికను సామాన్యునికి అందించే లక్ష్యంతో, అత్యుత్తమ సేవలు అందిస్తూ, ప్రగతి పథంలో భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నదని ఆయన సందర్భంగా తెలియజేశారు. పాత బస్టాండ్ శాఖ 2018 ఏప్రిల్ లో ప్రారంభమై, నేటికి 138 కోట్ల లావాదేవీలతో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలకు చేయూతగా పట్టణం, స్వయం శక్తి, శక్తి సంఘాలకు చేయూతనిస్తూ మహిళా సాధికారత, స్వావలంబన దిశగా అడుగులు ముందుకేస్తున్నదని, ఈ సదవకాశాన్ని మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా




వ్యవహరించిన జగన్మోహన్ రావు మాట్లాడుతూ ఖాతాదారుల ఇంటి వద్దకు బ్యాంకింగ్ సేవలు అందజేయడం సంతోషమన్నారు. గౌరవ అతిధులుగా విచ్చేసిన పొట్నూరు నాగేశ్వరావు, ఇండియన్ బ్యాంకు సేవలను కొనియాడారు. కార్యక్రమానికి వ్యాఖ్యతగా వ్యవహరించిన మండ.శ్రీనివాస రావు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ అంటేనే ఒక నమ్మకమని, ఇండియన్ బ్యాంకు వయోవృద్ధులకు, సీనియర్ సిటిజెన్ సేవింగ్స్ స్కీమ్, బాలికల కొరకు సుకన్య సమృద్ధి స్కీంలు, భవిష్యత్ కు బాటలు వేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు ఈశ్వరరావు, మెప్మా ఉద్యోగులు బ్యాంకు అధికారులు, స్రవంతి, తేజస్విని ఉద్యోగి తిరుపతి రావు, మహిళ ప్రతినిధులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



# కర్నాటక డిఫెన్స్ మద్యం సీజ్

**హైదరాబాద్,ఆగస్ట్21 జయ జయహే**

నగరంలోని అమీర్‌పేట్‌లో కర్ణాటక డిఫెన్స్ లిక్కర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఆర్‌నగర్ ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద అనుమానాస్పదంగా మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తిని పోలీసులు గుర్తించారు. వెంటనే అతడిని తనిఖీ చేయగా.. తొలుత నాలుగు కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. విచారణలో గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి మద్యం తీసుకున్నట్లు సదరు వ్యక్తి వెల్లడించాడు. దీంతో వెంటనే గోవర్ధన్ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించగా.. దాదాపు 51 కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం 55 కర్ణాటక మద్యం బాటిళ్లను పోలీసులు సీజ్ చేశారు. కర్ణాటక నుంచి తక్కువ ధరకు డిఫెన్స్ మద్యం తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయాలు జరుపుతున్నట్లు విచారణలో బయటపడింది. ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 వరకు లాభం పొందుతున్నట్లు తేలింది. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు అమీర్‌పేట్ ఎక్సైజ్ సీఐ బానోత్ పటేల్ వెల్లడించారు.



# అన్న సమారాధన "ఒక పవిత్రమైన కార్యక్రమం"

### బిజెపి మహిళ మోర్చ అధ్యక్షురాలు డా.పైడి.సింధుర

**శ్రీకాకుళం. -(జయ జయహే)**

అన్న సమారాధన, ఒక పవిత్రమైన కార్యక్రమం అని, నిరంతర అన్నదాతగా ఉర్లం.శివతేజ పట్నాయక్ నిలవటం హర్షణీయమని, బిజెపి జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు, లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ డా.పైడి.సింధుర (ఈఎన్టీ) అన్నారు. స్థానిక మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో నడుపబడుతున్న, పట్టణ నిరాశ్రయుల (నైట్ షెల్టర్) భవనంలో, నివాసకులకు అన్న సంతర్పణ చేశారు. ఇందులో భాగముగా డా.పైడి.సింధుర, సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్ తో కలసి, అన్నప్రసాదం అందించి మాట్లాడుతూ అన్నం పరబ్రమ్మ స్వరూపమని, భక్తులకు లేదా బంధువులకు భోజనం పెట్టే పవిత్రమైన కార్యక్రమమన్నారు. హిందూ సంప్రదాయంలో అన్నదానాన్ని అన్ని దానాలకంటే గొప్పదైన 'మహాదానం'గా పరిగణిస్తారని, జాతి, కుల, మత భేదం లేకుండా ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆహారం అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి నెల ఇక్కడ అన్నప్రసాదాన్ని అందిస్తున్నామని, నేడు నా జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ, పొడుగు.చరణ్ లకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. తల్లితండ్రుల ఆశయాలను కొనసాగిస్తున్న, ఉర్లం.శివతేజ నిస్వార్థ అమూల్యమైన సేవలు కొనసాగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు



# పుతేరి గ్రామంలో ఓటర్ల రీ-వెరిఫికేషన్

**బి యన్ కండ్రిగ, ఆగస్టు 21 (జయ జయహే)**

పుతేరి గ్రామంలో శుక్రవారం ఓటర్ల రీ-వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు మరియు ధృవీకరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేడం వెంకట రత్నమ్మ, బీఎల్ఓ తేజ, పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొని ఓటర్ల వివరాల పరిశీలనను పర్యవేక్షించారు. అలాగే బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు హరిబాబు రెడ్డి, టీడీపీ మాజీ సర్పంచ్ రామ్మూర్తి, టీడీపీ బీఎల్ఏ రమేష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు దయాసాగర్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు.



# వేడుకగా వరలక్ష్మీ వ్రతం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 21,జయ జయహే.**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేద పండితులచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి సేవలో భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి దేవస్థాన చైర్మన్ కే సాయి ప్రసాద్ కార్యనిర్వహణాధికారి బికే వెంకటేశులు బిజెపి రాష్ట్ర ఉప అధ్యక్షులు కోలా ఆనంద్,ధర్మకర్తల మండలి సభ్యులు గుర్రప్ప శెట్టి, కోలా వైశాలి, లక్ష్మమ్మ, శైలజ పాల్గున్నారు.

## కారులో తరలిస్తున్న 9 కోట్ల నగదు స్వాధీనం

**బెంగళూరు,ఆగస్ట్21 జయ జయహే.**


కర్ణాటక రాజధాని బెంగళూరులో భారీగా నగదు పట్టుబడింది. కారులో తరలిస్తున్న సుమారు రూ.9 కోట్ల నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఈ నగదును పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరు నుంచి నగదును తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, సమాచారం ఆధారంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కారులో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. నగదును తూత్తుకుడికి తరలిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో సచిన్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# నైతికతయే విద్యకు పునాది

**గురువు లేక విద్య గురుతుగా దొరకదు**
**నృపతి లేక భూమి నివతి గాదు**
**గురువు విద్య లేక గురుతర ద్విజుడౌని**
**విశ్వదాభిరామ వినురవేమ.!!**

**భావము :**

గురువు లేని విద్య అబ్బదు. పరిపాలించే రాజు లేకపోతే భూమి నిస్సారంగా ఉంటుంది అదే విధంగా తగిన విద్య లేకపోతే ఎవరు ద్విజుడు (గొప్ప జ్ఞాని) కాలేరు.



**వైదిక కాలంలో విద్యా విధానం - విద్యార్థి అవలంబించే విద్య:**

పురాతన కాలంలో విద్యను కన్నుగా భావించేవారు. జ్ఞానానికి మార్గంగా ఈ చదువును భావించేవారు.ఆనాటి విద్య యొక్క ప్రధాన లక్ష్యం ఆత్మసాక్షాత్కారం. విద్య నేర్చుకుని మన అభిరుచులకు శక్తి సామర్థ్యాలకు, అనుగుణంగా, సమాజానికి హితవుగా, ఎదిగే వారి మనుజులు. విద్య లేనివాడు వింత పశువుతో సమానం విద్య లేనివారు అంటే అంధులు తో సమానము అని భావించి జ్ఞాన గమనానికి విద్య మూలం అని సత్పురుషుల భావన. స్త్రీ పురుషులు ఇరువురు మంచి విద్యను అభ్యసించి ఈ సమాజంలో బోధించే స్థాయికి వెళ్ళాలి అనేది వైదిక యుగంలో తెలియజేసిన విద్యా రీతి. విద్య మాత్రమే కీర్తిని భోగభాగ్యాలను, సుఖ సౌఖ్యాలను, కీర్తి ప్రతిష్టలను, ప్రసాదించగలదు అని పండితుల అభిప్రాయం. విద్య మనిషి యొక్క కష్టాలను తొలగించి మంచి నాగరిక పౌరునిగా సమాజానికి మనిషిని అందిస్తుంది.

విద్యా విధానం – స్వరూప స్వభావం : ప్రాథమిక దశలో విద్యను అభ్యసించే పిల్లవాడికి విద్య అనేది పునాది. మాధ్యమిక విద్యా,ఉన్నత విద్యా పిల్లలను చైతన్యపరిచి నైపుణ్యాన్ని వెలికి తీసే పరికరం విద్య. కళాశాల విశ్వవిద్యాలయ మరియు ఉన్నత స్థాయిలో విద్య మానవుని యొక్క అంతర్గత సామర్థ్యాలను బయటకు రప్పించి విద్యార్థులలో ఉన్న వృత్తి నైపుణ్యాలను అందిస్తుంది.

"విద్యా అనగా కేవలం డిగ్రీలు పొంది పట్టాలను పొందుపరుచుకునే ప్రక్రియ కానీ కాదు. సమాజంలో నిజమైన విద్యను అభ్యసించి దేశాభివృద్ధికి దేశ భవిష్యత్తుకు వెలుగులు పంచి నవనిర్మాణ విద్యాశకానికి విద్యార్థి నాంది కావాలి అనే ఆశయాన్ని విద్యార్థి అంతః ఆలోచనలో పదిలం చేసుకుని విద్యను అభ్యసించడం ఉత్తమోత్తమమైన ప్రక్రియ."""

"విద్య మనిషికి సుగంధం లాంటిది."
– చాణిక్య నీతి.

"విద్య యొక్క నిజమైన ఉద్దేశం నైపుణ్యంతో మంచి మానవులను తయారు చేయడమే."
– ఏ.పీ.జే అబ్దుల్ కలాం.

నేటి విద్యా విధానంలో ఎక్కువ శాతం బట్టి విధాన పద్ధతి కొనసాగుతున్నది గ్రామీణ పట్టణ పాఠశాలలో మౌలిక వసతుల్లో కూడా కొన్ని లోపాలు ఉన్నాయి పిల్లలను ఐదు సంవత్సరాలు నిండకుండా పాఠశాలలో చేర్పించి అందమైన బాల్యాన్ని దూరం చేస్తే విద్యార్థి దశలో విద్యార్థికి ఎన్నో రకాలైన ఆటుపోట్లను ఎదుర్కోవలసిన రోజులు వస్తున్నాయి. సాంఘిక పరిపక్వత ఆనందాన్ని ఉత్సాహాన్ని తల్లిదండ్రులతో గడిపే సమయాన్ని కోల్పోయి సాంకేతికతపై ఆధారపడి జీవించాల్సిన పరిస్థితుల్లోకి విద్యార్థులు వెళ్లిపోతున్నారు.

**విద్యార్థి విద్యను నేర్చుకునే:**

నిజాయితీ క్రమశిక్షణ గౌరవం బాధ్యత దయ ఇవన్నీ కలిపితేనే నైతికత మార్కులు ఎక్కువ వచ్చి నైతికత లేకపోతే పిల్లవాడు చదువుకున్న నిష్ప్రయోజకుడు అవుతాడు రాక్షసత్వం వస్తుంది. చదువు ం నైతికత = సంపూర్ణ మనిషి అవుతాడు. చిన్న తప్పు చేసిన ఒప్పుకునే విధంగా ధైర్యం ఉండాలి.సత్య సాధన తో నిరంతరం అడుగులు వేయాలి.

**నైతికత బోధించే అంశాలను విద్యాలయాల్లో ప్రవేశపెట్టాలి :-**

1.డిగ్రీ ఉంటే మంచి ఉద్యోగం సాధించవచ్చు అని కాకుండా మంచి వ్యక్తిత్వం ఉంటేనే సమాజంలో గౌరవం పొందవచ్చు అనేది తెలుసుకోవాలి.

2. చదువు చేతిలో ఉంటే ఉద్యోగం పదవీ లభిస్తాయి కానీ నైతికత గుండెల్లో ఉంటే దేశం నీ చేతిలో ఉంటుంది అన్న విషయాన్ని గమనించాలి.

3. రామాయణం, భాగవతం వేదాలు సారం విద్యార్థి దశ నుండి పాఠ్యాంశంగా బోధన జరపాలి.

4. క్రమశిక్షణతో పాటు సమయపాలన అలవరచు కోవడం ప్రధాన లక్ష్యం.

5. లక్ష్యసాధనలో నిరంతరం మన ఆలోచనలు ఉండాలి దానికి ఎటువంటి కష్టాన్నైనా ఎదురీది నిలబడఎగలగాలి.

6. గురు బ్రహ్మ గురు విష్ణు అనే నినాదాన్ని మనసులో మననము చేసుకుంటూ,గురువు చెప్పిన విధంగా నేర్చుకొని, తెలియని విషయాలను తెలుసుకొని,నిరంతరం గురువును దైవంగా భావించాలి.

7. సత్సంగత్యాన్ని ఎంచుకొనే విధంగా అడుగులు వేయాలి.

8. సేవా భావం అనేది విద్యార్థి దశ నుండి అలవర్చుకోవలసిన ఉత్తమ గుణము.

9. నైతికత ఉన్న విద్యా విధానం ఎక్కువగా అలవర్చుకోవాలి అంటే మాతృభాషలో ఉన్న భావనను విద్యార్థికి అందించగలగాలి.

10. ఈనాటి ఉత్తమ విద్యా విధానంతో కూడిన విద్యే రేపటి దేశ దేశాభివృద్ధికి పునాది రాయి.




రచన..
ఏ బాల సౌజన్యకుమారి
తెలుగు ఆచార్యులు, విద్యావేత్త, ప్రవచనాకర్త,
నంది అవార్డు గ్రహీత అనకాపల్లి

# తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైకోర్టులో ముగిసిన వాదనలు**

**16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు**

**జయ జయహే.**

తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు మ-ుగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు..



కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# పవన్, లోకేశ్‌ల వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు

**జయ జయహే.**

వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని వరలక్ష్మి స్వరూపంగా పూజిస్తామని అన్నారు. ఈ పవిత్ర శ్రావణ శుక్రవారం శ్రీ వరలక్ష్మి అమ్మవారి కరుణాకటాక్షాలు అందరికీ అందాలని పవన్ ఆకాంక్షించారు. 'శ్రావణ మాసంలో నిర్వహించే పవిత్రమైన వరలక్ష్మి వ్రతం భక్తిశ్రద్ధలకు, కుటుంబ సౌభాగ్యానికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక. శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని వరలక్ష్మి స్వరూపంగా పూజిస్తూ, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థించే ఈ పవిత్ర పర్వదినం మన ఆధ్యాత్మిక వారసత్వంలోని గొప్ప విశిష్టతను ప్రతిబింబిస్తుంది. ఈ పవిత్ర శ్రావణ శుక్రవారం శ్రీ వరలక్ష్మి అమ్మవారి కరుణాకటాక్షాలు అందరికీ అందాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, సమృద్ధి నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రజలందరికీ నా హృదయపూర్వక వరలక్ష్మి వ్రతం శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.మహిళలకు సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చే పండుగ వరలక్ష్మి వ్రతం అని మంత్రి లోకేశ్ అన్నారు. ఆ వరలక్ష్మి దేవి కృపతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఏపీ ప్రజలకు మంత్రి లోకేశ్... ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.



## దేశంలో భారీగా పెరిగిన
# చక్కెర ధరలు

**ఇథనాల్ ఉత్పత్తితో ధరలకు సంబంధం లేదన్న కేంద్రం**

**ప్రి డయాబిటిస్ కారణం ధల ప్రభావం ఉండదన్న బీహార్ మంత్రి**

**జయ జయహే.**



దేశంలో ఇటీవల చక్కెర ధరలు పెరగడంపై కేంద్రం స్పందించింది. ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడం వల్లే వీటి ధరలు పెరిగాయనడం సరికాదని పేర్కొంది. స్థానికంగా దిగుబడి తగ్గడం, పండగల వేళ డిమాండ్ పెరగడమే ధరల పెరుగుదలకు కారణాలని స్పష్టం చేసింది. ధరల నియంత్రణకు చర్యలు చేపట్టామని.. నిల్వలపై పరిమితులు విధించడంతోపాటు దిగుమతులపైనా సుంకాలు తగ్గించామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశంలో జులై 20న కిలో చక్కెర ధర రూ.48.18గా ఉండగా.. ఆగస్టు 20నాటికి అది రూ.55.70కు పెరిగింది. దీంతో ఇథనాల్ తయారీకి కోసం చక్కెర మళ్లించడం వల్లే ఈ ధరలు పెరిగాయని విపక్షాలు విమర్శలు గుప్పించాయి. పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ తయారీ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో 12శాతం ఉండగా.. 2025-26లో 9శాతానికి తగ్గిందని కేంద్రం తెలిపింది. అంచనాల కంటే తక్కువ దిగుబడి రావడం, పండగల వేళ డిమాండ్, పంట నష్టం, అంతర్జాతీయ సరఫరాల్లో అంతరాయం, ఊహాగానాలతో కొంతమంది నిల్వలు పెంచడం, తదితర కారణాల వల్ల ధరలు పెరిగాయని స్పష్టం చేసింది. దేశంలో దాదాపు మూడోవంతు ఇథనాల్.. మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచే ఉత్పత్తి అవుతోందని తెలిపింది. దేశవ్యాప్తంగా గత వారం రోజులుగా చక్కెర ధరలు పెరుగుతున్న క్రమంలో.. ఈ పరిణామంపై బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రావణ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈరోజుల్లో ప్రతీ ఒక్కరికీ డయాబెటిస్ ఉందని.. అందువల్ల పంచదార ధర పెరిగినా పెద్ద ప్రభావం ఏం ఉండకపోవచ్చని ఈ బీహార్ మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రీ-డయాబెటిక్, డయాబెటిక్ కేసులు పెరుగుతున్న కారణంగా ప్రజలు ఎలాగూ చక్కెర వినియోగం విషయంలో జాగ్రత్త పడుతున్నారని.. ఈ క్రమంలో చక్కెర ధర పెరిగినా దేశ ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చనేది ఈ మంత్రి వ్యాఖ్యల సారాంశం. మధుమేహ రోగుల కేసులు పెరుగుతున్నందున, ప్రజలు స్వీట్లు తినడం లేదని, స్వీట్లు తక్కువగా తింటున్నారని మంత్రి చెప్పారు. విలేకరుల ముందు ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదెక్కడి లాజిక్ అని.. మంత్రి ప్రకటనపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షమైన ఆర్జేడీ మాత్రం కుమార్‌పై తీవ్రమైన వ్యంగ్యంతో విరుచుకుపడింది. కప్పు టీతో తమ దినచర్యను ప్రారంభించే లేదా బ్రెడ్ లేదా బిస్కెట్‌ను టీలో ముంచుకుని తాగే సామాన్య ప్రజలు, పెరుగుతున్న చక్కెర ధరల వల్ల తీవ్ర ప్రభావానికి గురయ్యారని ఆర్జేడీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ తెలిపారు. శ్రావణ్ కుమార్ ఒక మంత్రి అయినందు వల్ల.. ఆయన పెరుగుతున్న చక్కెర ధరను భరించగలరని.. అందుకే చక్కెర ధరలపై సామాన్య ప్రజల ఆందోళనలు ఆయనకు హాస్యాస్పదంగానే అనిపించవచ్చని అహ్మద్ అన్నారు.

## లండన్‌లో ఆక్స్‌ఫర్ యూనివర్సిటీని సందర్శించిన సిఎం

**జయ జయహే.**



లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి భారతదేశంతోనూ ప్రత్యేక అనుబంధం ఉందని.. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు ఉన్నారు.

## ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

**రిటర్న్ టిక్కెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ**

**జయ జయహే.**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ముందస్తు రిజర్వేషన్‌ను ప్రోత్సహించేందుకు ఒక ప్రత్యేకమైన ఆఫర్‌ను అందుబాటు లోకి తెచ్చింది. ప్రయాణికులు తమ రాకపోకల టికెట్లను ఒకేసారి బుక్ చేసుకోవడం ద్వారా తిరుగు ప్రయాణం టికెట్‌పై 10 శాతం తగ్గింపును పొందవచ్చు. దూరప్రాంతాలకు ప్రయాణించే వారికి, అలాగే వారాంతాల్లో కుటుంబంతో కలిసే వెళ్లేవారికి ఈ ఆఫర్ ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు , ప్రయాణికులను ఆకట్టుకునేందుకు సంస్థ ఈ ప్రత్యేక పథకాన్ని డిజైన్ చేసింది. ఈ ఆఫర్‌ను పొందడానికి ప్రయాణికులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మొబైల్ యాప్ ఉపయోగించి ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకోవలసి ఉంటుంది. వెళ్లేందుకు, తిరిగి రావడానికి ఒకేసారి టికెట్లను రిజర్వ్ చేసినప్పుడు మాత్రమే వర్తించే ఈ ఆఫర్ ద్వారా ప్రయాణికులు తమ ప్రయాణ ఖర్చులపై మంచి ఆదా చేసుకోవచ్చు. ప్రయాణ తేదీలను ముందుగానే ఎ÷-లాన్ చేసుకునే వారికి సీట్ల లభ్యత సమస్య లేకుండా, తక్కువ ధరలోనే టికెట్ దొరికే సౌకర్యం కలగడమే కాకుండా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునే వీలు కలుగుతుంది. టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన సందేహాల నివారణకు లేదా సమాచారం కోసం సంస్థ హెల్ప్‌లైన్ నంబర్లు 040-69440000, 040-23450033 లను కూడా అందుబాటులో ఉంచింది. ప్రైవేట్ వాహన ప్రయాణాల కన్నా భద్రత, సౌకర్యం అధికంగా ఉండే ఆర్టీసీ బస్సుల సేవలను వినియోగించుకోవాలని సంస్థ కోరుతోంది. రాబోయే పండుగలు, సెలవుల సీజన్‌లో ప్రయాణించే వారు చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ఈ ముందస్తు బుకింగ్ 10 శాతం డిస్కౌంట్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను మరింత మందికి అందుబాటులోకి తీసుకురావడానికి ఆర్టీసీ తీసుకుంటున్న ఈ చర్యకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.



## హార్ట్ ప్రాబ్లమ్స్ రాకుండా ఉండాలంటే...

### వీటికి దూరంగా ఉండండి

**గుండె ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొన్ని ఫుడ్స్ తీసుకోవాలి. మరికొన్ని ఫుడ్స్‌ని అసలే తీసుకోవద్దు. దీని వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరిగి గుండె సమస్యలకి కారణమవుతుంది. అందుకోసమే కొన్ని ఫుడ్స్ తీసుకోవడాన్ని తగ్గించాలి. అలాంటి ఫుడ్స్ ఏంటో తెలుసుకోండి.**

**శాచ్యురేటెడ్ ఫ్యాట్స్..**
ఈ ఫ్యాట్స్‌నే చెడు కొలెస్ట్రాల్ అంటారు. దీనిని తీసుకోవడం వల్ల మీ బాడీలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. పేస్ట్రీలు, బిస్కెట్స్ వంటి ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవద్దు. మీట్‌ని తీసుకోవడాన్ని తగ్గించాలి. వీటితో పాటు ఫ్రైడ్ ఫుడ్స్, చిప్స్, బేక్డ్ ఫుడ్స్, మైదాతో తయారైన ఫుడ్స్ తీసుకోవద్దు.

**గుండెపోటు ముందు కనిపించే లక్షణాలు..**

**షుగర్ ఫుడ్స్..**
షుగర్ ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ పెరుగుతాయి. బరువు పెరుగుతారు. దీని వల్ల ఆటోమేటిగ్గా గుండెపై ఎఫెక్ట్ పెడుతుంది. కాబట్టి, వీటిని తీసుకోవద్దు.

**సోడియం..**
మనం తీసుకునే ఫుడ్స్‌లో సోడియం ఎక్కువగా ఉంటే గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఏవైనా ఫుడ్స్ తీసుకున్నప్పుడు సోడియం కంటెంట్ తక్కువగా ఉండేలా చూసుకోండి.

**కూల్‌డ్రింక్స్..**
కూల్ డ్రింక్స్‌లో కూడా షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల బరువు పెరుగుతారు. గుండెకి కూడా మంచిది కాదు. కాబట్టి, కూల్ డ్రింక్స్‌ని తీసుకోవద్దు. ఇవే కాదు.. పండ్లతో తయారైన జ్యూస్ కూడా తాగొద్దు. ఇందులో ఎక్కువగా షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ప్యాకేజ్డ్ డ్రింక్స్ తాగొద్దు. వీటి వల్ల కూడా షుగర్ తీసుకున్నట్లే అవుతుంది.

**ఆల్కహాల్..**
ఆల్కహాల్ తీసుకోవడం వల్ల కూడా గుండె సమస్యలు వచ్చే రిస్క్ పెరుగుతుంది. కాబట్టి, ఆల్కహాల్ తీసుకోవడాన్ని తగ్గించాలి.

**కెఫిన్ డ్రింక్స్..**
కెఫిన్ ఎక్కువగా ఉండే డ్రింక్స్ కూడా గుండెకి అంత మంచివి కావు. వీటిని తీసుకోవడం వల్ల గుండెపై ఎఫెక్ట్ పడుతుంది. కాఫీ వంటివి తీసుకున్నా మోతాదులోనే తీసుకోవాలి.

## ఇల్లు ఊడ్చి, చక్కగా తుడిచే రోబో క్లీనర్

### మీరు చెప్పినట్టు వింటుంది




**ప్రతిరోజు ఇల్లు ఊడిచి, తడిగుడ్డ వేసి అలసిపోతున్నారా. అయితే మీరు వీటి గురించి తెలుసుకుని తీరాల్సిందే. ఇవి మీకు శ్రమ లేకుండా ఇంటిని సూపర్ ఫాస్ట్‌గా శుభ్రం చేసేస్తాయి. అంతేకాదు ఇంటిలోని ప్రతి మూలను మెరిపిస్తుంది. ఇంతకీ అవి ఏంటో ఈ స్టోరీలో చూద్దాం..**

మహిళలకు వంట పని తర్వాత ఇబ్బంది కలిగే పని అంటే ఇళ్లు క్లీనింగ్. ఎందుకంటే ఇల్లు ఊడ్చి తడిగుడ్డ పెట్టాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని. సోఫా కింద, మంచం కింద, బీరువాల కింద వంగి ఊడవాలన్నా, తడిగుడ్డ పెట్టాలన్నా చాలా కష్టం. ఇక ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో ఒక పక్క ఉద్యోగాలు చేసుకుంటూ.. మరో పక్క పిల్లల్ని చూసుకోవడం, ఇంటి పనులు చేయడం అంటే పని భారం మామూలుగా ఉండదు. పని చేసే ఓపిక ఉన్నా సమయం ఉండదు. ఒక్కోసారి సమయం ఉన్నా.. పనులు చేసేందుకు ఓపిక ఉండదు. అయితే వీటన్నింటికి చెక్ పెట్టేందుకు మీకోసం ఒక అద్భుతమైన ప్రొడక్ట్ వచ్చేసింది. అదే “రోబో వ్యాక్యూమ్ క్లీనర్”. మీరు రిమోట్‌తో ఆపరేట్ చేస్తే చాలు.. దాని పని అది చేసుకుంటుంది. అసలు ఇది ఎలా పనిచేస్తుంది?

బట్టలు ఉతకడానికి వాషింగ్ మెషీన్లు, గిన్నెలు శుభ్రం చేయడానికి డిష్ వాషర్లు, ఇంటిని శుభ్రం చేయడానికి వ్యాక్యూమ్ క్లీనర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆల్ రెడీ వాక్యూమ్ క్లీనర్లు ఉన్నాయి కాదా.. మళ్లీ ఈ రోబో క్లీనర్లు ఎందుకూ అనే డౌట్ మీకు రావచ్చు. అయితే వ్యాక్యూమ్ క్లీనర్లను మనం ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఇంట్లోని దుమ్ము, చెత్తను తొలగించడానికి మాత్రమే అవి ఉపయోగపడతాయి. ఆ తర్వాత ఇళ్లు తుడవాలంటే మాప్‌లు ఉపయోగించాల్సిందే. అదే ఈ రోబో వాక్యూమ్ క్లీనర్ ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. ఇది కూడా ఇంట్లోని దుమ్ము, చెత్తను తొలగించడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా వీటిలోని పలు మోడల్స్ ఇల్లు ఊడ్చేసి తడిగుడ్డ కూడా పెట్టేస్తాయి.

**ప్రయోజనాలు చూస్తే:**

ఆటోమెటిక్‌గా శుభ్రం చేయడం: సాధారణంగా వ్యాక్యూమ్ క్లీనర్ల వెంట మనం ఉండాల్సిందే. కానీ వీటికి మనం వెంట ఉండనవసరం లేదు. జస్ట్ ఆన్ చేస్తే చాలు ఇవి స్వయంగా ఇంటిని శుభ్రం చేస్తాయి.

అన్ని రకాల నేలలపై పని చేస్తాయి: కార్పెట్లు, టైల్స్, లామినేట్ ఫ్లోరింగ్ వంటి అన్ని రకాల నేలలపై ఇవి సమర్థవంతంగా పని చేస్తాయి.

చెత్తను సేకరించడం: చిన్న చిన్న ముక్కలు, జుట్టు, బిస్కెట్ ముక్కలు ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల చెత్తను సులభంగా సేకరించి అందులోనే స్టోర్ చేసుకుంటాయి. తర్వాత దాని నుంచి చెత్తను తీసివేస్తే సరి.

షెడ్యూల్ చేయడం: మనం నచ్చిన సమయంలో ఆటోమేటిక్‌గా శుభ్రం చేయడానికి షెడ్యూల్ చేయవచ్చు.

అధునాతన ఫీచర్లు: కొన్ని రోబో వాక్యూమ్ క్లీనర్‌లలో మ్యాపింగ్, వాయిస్ కమాండ్‌లు, అప్లికేషన్ కంట్రోల్ వంటి అధునాతన ఫీచర్లు ఉంటాయి.

శత్రువులను ఖతం చేసే AI రోబో’- ఎనిమీ ఎక్కడ ఉన్నా గురితప్పదు! యుద్ధభూమిలో 360 డిగ్రీల కవరేజ్!

**ఎలా ఆపరేట్ చేయాలి:**

ముందుగా ఛార్జింగ్ పెట్టాలి. ఆ తర్వాత బటన్ ప్రెస్ చేస్తే ఆన్ అవుతుంది. లేదా రిమోట్ ద్వారా కూడా ఆపరేట్ చేయవచ్చు.

కొన్ని క్లీనర్లకు మొబైల్ యాప్ ద్వారా ఆదేశాలు ఇవ్వొచ్చు.. మరికొన్ని వాయిస్ కమాండ్ ద్వారా ఆపరేట్ చేయొచ్చు.

ఫోన్లో యాప్ ద్వారా టైమ్ సెట్ చేస్తే చాలు.. ప్రతిరోజూ ఆ టైమ్ ప్రకారం వాటంతటవే పని చేస్తాయి.

మనం ఇంట్లోలేకున్నా వాటిని ఆపరేట్ చేయొచ్చు.

అలాగే వాటిని ఉపయోగించేటప్పుడు క్లీనింగ్ మోడ్‌లను ఎంచుకోవచ్చు. అంటే..

ఆటో మోడ్: క్లీనర్ స్వయంగా ఇంటిని స్కాన్ చేసి క్లీన్ చేస్తుంది.

స్పాట్ క్లీనింగ్: ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని క్లీన్ చేయడానికి ఈ మోడ్ ఆన్ చేయాలి.

ఎడ్జ్ క్లీనింగ్: గోడల వెంబడి క్లీన్ చేయడానికి.

షెడ్యూల్ క్లీనింగ్: ముందే నిర్ణయించిన సమయం ప్రకారం క్లీనర్ స్వయంగా ఆన్ అవుతుంది. పని చేస్తూ వెళు ుంది.

మీకు కావాల్సిన క్లీనింగ్ మోడ్‌ను ఎంచుకున్న తర్వాత.. స్టార్ట్ బటన్ లేదా యాప్/రిమోట్ ద్వారా ఆన్ చేస్తే క్లీనర్ తన పనిని ప్రారంభిస్తుంది.

క్లీనింగ్ పూర్తయిన తర్వాత.. అది ఆటోమెటిక్‌గా ఛార్జింగ్ డాక్‌కు తిరిగి వెళుతుంది. ఆ తర్వాత పవర్ ఆఫ్ చేస్తే సరి. కొన్ని క్లీనర్స్ ఆటోమెటిక్‌గా అవే ఆఫ్ అయిపోతాయి.

ఎక్కడ లభిస్తాయి?: ప్రస్తుతం ఈ రోబో వ్యాక్యూమ్ క్లీనర్లు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలలో అందుబాటులో ఉన్నాయి. ఫీచర్స్‌ను బట్టి ధరలు ఉంటాయి. అలాగే ప్రముఖ కంపెనీలు వీటిపై ఆఫర్స్ కూడా ప్రకటిస్తున్నాయి. యంత్రాల్లా ఉండే వీటిల్లో ఇంటి అవసరాల్ని బట్టి మనకు కావలసినదాన్ని ఎంచుకోవచ్చు, పనుల భారాన్ని తగ్గించుకోవచ్చు.

## ఈ రూల్స్ ఫాలో అయితే

# ఎవరైనా సక్సెస్ అవుతారు



**ప్రతి ఒక్కరి జీవితంలో రోజుకి 24 గంటలే ఉంటాయి. ప్రతి ఒక్కరికీ ఉండేవి అదే రాత్రి, అదే పగలు. కానీ, కొంతమంది జీవితంలో సక్సెస్ అయితే, మరికొంతమంది మాత్రం లైఫ్‌ని భారంగా భరిస్తుంటారు. దీనికి కారణాలు.. లైఫ్‌ని మార్చేందుకు కొంతమంది కొన్ని రూల్స్ ఫాలో అయితే, మరికొంత మంది వారికి నచ్చింది చేసుకుంటూ పోతారు. అసలు జీవితంలో సక్సెస్ కావాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.**

**నేర్చుకోవడం..**
ఏదైనా విషయాన్ని నేర్చుకోవడాన్ని ఆపొద్దు. ప్రతిరోజూ ప్రపంచంలో కొత్త అప్‌డేట్స్ వస్తూనే ఉంటాయి. అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. కాబట్టి, ఎప్పటికప్పుడు కొత్త విషయాలు, ట్రెండ్స్ నేర్చుకోవడం, తెలుసుకోవడం ముఖ్యం.

**నమ్మడం..**
మిమ్మల్ని, మీ సామర్థ్యాలని నమ్మాలి. మీపై మీకే నమ్మకం లేకపోతే మరెవరూ నమ్ముతారు. మీ గోల్స్ సాధించే వరకూ మీ సామర్థ్యాన్ని నమ్మి పనులు చేయండి.

**పోల్చుకోవడం..**
ప్రతి ఒక్కరి జీవితాలు వేర్వేరుగా ఉంటాయి. అందుకని, మనం ఇతరులతో పోల్చుకుని మన జీవితాన్ని తక్కువ చేయొద్దు. మనకున్న టాలెంట్‌ని గుర్తించి వాటిని ఇంకా మెరుగ్గా చేసుకుని సక్సెస్ అయ్యేందుకు ఏం చేయాలో వాటిపై దృష్టిపెట్టాలి.

**కలల సాకారం కోసం..**
ప్రతి ఒక్కరి జీవితంలో చాలా కలలు ఉంటాయి. వాటిని సాకారం చేసుకోవాలంటే ముందుగా కనే కలలు ఎంత అసాధ్యమని అనిపించినా వాటిని వదులుకోవద్దు. కష్టపడి ఇష్టపడి వాటిని అచీవ్ చేసేందుకు కష్టపడుతూనే ఉండాలి. అల వదలకుండా ప్రయత్నిస్తే ఎప్పటికైనా ఆ కల సాకారమవుతుంది.

**క్రియేట్ చేయడం..**
మీరు ఏదైనా కొత్తవి క్రియేట్ చేయండి. అందరి దారిలో మీరు వెళ్ళకుండా మీకంటూ గుర్తింపు ఉండేలా ఏదైనా విషయాన్ని క్రియేట్ చేస్తే అదే మీ సక్సెస్‌కి కారణమవ్వొచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com